
మంగళవారం 4, మార్చి 2025
https://www.telugudesam.org

# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





## సీఎం ఛాంబర్‌కు డిప్యూటీ సీఎం పవన్

- గంటపాటు భేటీ
- వివిధ అంశాలపై చర్చ

6

# గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రంగా ఏపీ


### లక్ష్యసాధనలో తొలి అడుగు పడిందన్న సీఎం చంద్రబాబు



- తిరుపతిలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి
- ఏర్పాట్లు చేసిన హీరో ఫ్యూచర్ ఎనర్జీస్
- రూ.1000 కోట్ల పెట్టుబడి, 2 వేల మందికి ఉపాధి
- ఏడాదికి 25 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం

- వివరాలు 2లో...

# సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత రాష్ట్రంగా ఏపీ



- ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపొందించాలి
- సమర్థవంతంగా వాట్సాప్ గవర్నెన్స్ వినియోగం
- ప్రభుత్వ సేవలన్నీ వాట్సాప్‌లోనే పొందేలా చూడాలి
- దీని ఉపయోగితపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్లు ఈ బాధ్యత తీసుకోవాలి
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- ఈ నెలాఖరుకు వాట్సాప్‌లో 300 రకాల సేవలందిస్తామన్న అధికారులు

3

# న్యాయం చేస్తాం

- సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులకు సీఎం హామీ

3



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి హవా!



ఆలపాటి

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపు బాటలో కూటమి అభ్యర్థులు
- ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల స్థానంలో ఆలపాటికి భారీ మెజారిటీ
- గోదావరి జిల్లాల్లో ముందంజలో పేరాబత్తుల
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు గెలుపు

5



పేరాబత్తుల

### అభ్యసన ఫలితాలే లక్ష్యంగా..

# పాఠశాల విద్యలో సంస్కరణలు



- మంత్రి నారా లోకేష్ స్పష్టీకరణ
- ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను నెం.1గా తీర్చిదిద్దుతాం
- సంస్కరణల అమలులో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం వహించాలి
- జూన్ నాటికి సంస్కరణలు పూర్తి, అక్కడ నుంచి ఫలితాలపైనే దృష్టి
- గతప్రభుత్వ నిర్వాకంతో ప్రభుత్వ స్కూళ్లలో 12లక్షల మంది విద్యార్థుల తగ్గుదల
- లెర్నింగ్ ఎక్సలెన్స్, జీఓ 117 రద్దుపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో మంత్రి లోకేష్ సమావేశం

4

# ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్

- కేజీ టూ పీజీ పాఠ్య పుస్తకాల్లో మార్పులు
- కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో మంత్రి లోకేష్

5

## పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలపై దృష్టి



- దశలవారీగా స్కూళ్లలో ప్రహరీగోడల నిర్మాణం
- నాడు-నేడు అక్రమాలపై విచారణ జరిపి చర్యలు
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్

6

## ఫేక్ ప్రచారాలతో వాస్తవాలు దాచలేరు

- వైసీపీకి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా కౌంటర్
- ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, కూటమి పోటీచేయలేదు
- విజయం సాధించిన గాదె శ్రీనివాసులుకు శుభాకాంక్షలు

5

ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై

## వైసీపీ మీడియా దుష్ప్రచారం

- మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజం

5

చైతన్యరథం

# గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రంగా ఏపీ

## లక్ష్యసాధనలో తొలి అడుగు పడిందన్న సీఎం చంద్రబాబు

- తిరుపతిలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి
- ఏర్పాటు చేసిన హీరో ఫ్యూచర్ ఎనర్జీస్
- రూ.1000 కోట్ల పెట్టుబడి, 2 వేల మందికి ఉపాధి
- ఏడాదికి 25 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం






అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ని అంతర్జాతీయ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రంగా మార్చాలనే లక్ష్యసాధనలో తొలి అడుగు పడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. తిరుపతిలోని రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్‌లో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లి నివాసం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దీని గురించి ఎక్స్‌లో ప్రత్యేకంగా పోస్ట్ చేశారు. హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ చేపట్టిన ఈ ప్రాజెక్ట్...పారిశ్రామిక అవసరాల కోసం పీఎన్జీ, ఎల్పీజీతో గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్‌కు సరికొత్త విధానాన్ని అనుసరిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ సాంకేతికత.. కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందని, భారతదేశ ఇంధన పరివర్తనకు కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తుందని వివరించారు. తిరుపతిలో ప్రవేశపెట్టిన ఈ స్కేలబుల్ మోడల్‌ను ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా, దేశవ్యాప్తంగా ఇతర పరిశ్రమల్లోనూ అనుకరించవచ్చని చెప్పారు. ప్రపంచం మొత్తం హరిత ఇంధనం వైపు వేగంగా అడుగులు వేస్తున్న సమయంలో, ఆంధ్రప్రదేశ్ కూడా తనదైన ముద్ర వేస్తోందన్నారు. తిరుపతిలో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ప్రారంభించిన గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, మన రాష్ట్ర ఎనర్జీ రంగంలో ఒక మైలురాయిగా అభివర్ణించారు.

### లక్ష్యానికి తొలి అడుగు ఇది

స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనలో పేర్కొన్నట్టుగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఏపీని ప్రపంచ కేంద్రంగా మార్చాలనే లక్ష్యానికి ఇది తొలి అడుగు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ(ఐసీఈ) పాలసీ-2024 కింద 160 గెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని, క్లీన్ ఎనర్జీలో రూ.10 ట్రిలియన్ల పెట్టుబడిని సాధిస్తా మనే విశ్వాసం ఉందన్నారు. శిలాజ ఇంధనాలపై ఆంధ్రప్రదేశ్ ఆధారపడటాన్ని తగ్గించడానికి, 2070 నాటికి భారతదేశ నెట్-జీరో లక్ష్యానికి మద్దతు ఇవ్వ డానికి, ముడి చమురు దిగుమతులను తగ్గించడానికి, ఇంధన భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌తో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ జైత్రయాత్ర మొదలు కావాలని కోరుకుంటు న్నాను. రాష్ట్రంలో వాణిజ్యానికి ఉన్న అనుకూల విధానాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి హీరో ఫ్యూచర్ ఎనర్జీస్‌కు సహకారం అందిస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు.

### ఎన్నో వనరులు... వినియోగించుకోండి

విస్తారమైన తీరప్రాంతం, లోతైన సముద్ర ఓడరేవులు, బలమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌తో ఆంధ్రప్రదేశ్... దేశీయ, ప్రపంచ మార్కెట్ అవసరాల ను తీర్చడానికి, గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతులకు కేంద్రంగా మారడానికి అనువైందని ముఖ్యమంత్రి వివరించారు. రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో రెండు వేల మందికి ఉపాధి కల్పించేలా ఈ ప్లాంట్ నెల కొల్పడంతో తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని సీఎం చంద్రబాబు చెప్పారు.

తిరుపతిలో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ప్రారంభించిన గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, ఆంధ్రప్రదేశ్‌లో ఎనర్జీ విప్లవానికి నాంది అని చెప్పవచ్చు. ఇది పర్యావరణ పరిరక్షణ, ఉపాధి కల్పన, ఆర్థిక అభివృద్ధికి అంతర్జా తీయ స్థాయిలో మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్ట్, ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో అంతర్జాతీయ కేంద్రంగా మార్చడంతో పాటు, భారతదేశ నెట్-జీరో లక్ష్యాన్ని సాధించడంలో తోడ్పడుతుంది.

### ప్రాజెక్టుతో ఎన్నో లాభాలు

రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ద్వారా రెండు వేల మందికి ఉపాధి కలుగుతుంది. ఏడాదికి 25 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తుంది. దీనిని ఏడాదికి 54 టన్నులకు పెంచుకునే అవకాశం ఉంది. ఏడాదికి 206 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాల తగ్గింపుతో పాటు, వాతావరణంలోకి ఏడాదికి 190 నుంచి 195 టన్నుల ఆక్సిజన్ విడుదల అవుతుంది. మొత్తమ్మీద 8 నుంచి 10 శాతం ఉద్గార తగ్గింపు సాధ్యమవుతుంది.

### హీరో ఫ్యూచర్ ఎనర్జీస్

2012లో స్థాపించిన హీరో గ్రూపునకు చెందిన పునరుత్పాదక ఇంధన విభాగం హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ పవన, సౌర, హైబ్రిడ్ ఇంధన వనరుల ఉత్పత్తిపై దృష్టి పెట్టి పర్యావరణ పరిరక్షణకు ప్రయత్నిస్తోంది.

భారతదేశం, యుకె, ఉక్రెయిన్, వియత్నాం, బంగ్లాదేశ్‌లో 1.9గిగా వాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులను నిర్వహిస్తూ రూ.1,460 కోట్ల వార్షిక ఆదాయం సాధిస్తూ ఈ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. ప్రపంచ క్లీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా, 2030 నాటికి సామర్థ్యాన్ని 30 గిగా వాట్లకి పెంచడానికి 20 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధంగా ఉంది.

### రాక్‌మాన్ ఇండస్ట్రీస్

1960లో స్థాపించిన హీరో గ్రూప్‌లో భాగమైన రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్ అల్యూమినియం డై-కాస్టింగ్ భాగాలు, అధునాతన కార్బన్ సంబంధిత ఆటో భాగా ల తయారీదారు. లుధియానా, హరిద్వార్, చెన్నై, బవాల్, సూరత్, వడోదర, తిరుపతి ప్లాంట్లతో రూ.2,390 కోట్ల వార్షిక ఆదాయం కలిగి ఉంది.

ఏరోస్పేస్, హై-ఎండ్ ఆటోమోటివ్ రంగాల్లోకి ప్రవేశించింది.

ఈ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ఎండీ, చైర్మన్ రాహుల్ ముంజల్, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ గ్లోబల్ సీఈవో శ్రీవాత్సన్ అయ్యర్, రాక్‌మాన్ ఇండస్ట్రీస్ ఎండీ ఉజ్వల్ ముంజల్, రాక్‌మాన్ ఇండస్ట్రీస్ సీఈవో కౌసిక్ మన్నా, ఓహ్మియం సీఈవో ఆర్నే బాలంటైన్ పాల్గొన్నారు.



చైతన్యరథం

# సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత రాష్ట్రంగా ఏపీ

- ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపొందించాలి
- సమర్థవంతంగా వాట్సాప్ గవర్నెన్స్ వినియోగం
- ప్రభుత్వ సేవలన్నీ వాట్సాప్‌లోనే పొందేలా చూడాలి
- దీని ఉపయోగితపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్లు ఈ బాధ్యత తీసుకోవాలి
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- ఈ నెలాఖరుకు వాట్సాప్‌లో 300 రకాల సేవలందిస్తామన్న అధికారులు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని ప్రతి పౌరుడూ డిజిటల్ అక్షరాస్యుడిగా మారాలి, తద్వారా రాష్ట్రాన్ని సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా తీర్చి దిద్దాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పీపుల్స్ పర్సెప్షన్, ఆర్టీజీఎస్ పైన సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ ప్రగతి గురించి సమీక్షించారు. రాష్ట్రంలో ప్రజలందరూ వాట్సాప్ గవర్నెన్స్ సులభంగా ఉపయోగించుకునేలా, ప్రభుత్వం నుంచి ఏ సేవ కావాలన్నా అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా కేవలం తమ ఫోనులో వాట్సాప్ ద్వారా తమకు కావాల్సిన సేవలు పొందే అవకాశాన్ని ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కల్పిస్తోందన్నారు. దీనిపై ప్రజల్లో ఇంకా అవగాహన కొంత తక్కువగా ఉందని, ప్రజలందరూ సమర్థవంతంగా వాట్సాప్ గవర్నెన్స్‌ను విరివిగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్లందరూ ఈ బాధ్యత తీసుకుని తమ జిల్లాలో ప్రజలు వాట్సాప్ గవర్నెన్స్‌ను పెద్ద ఎత్తున ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాలు, సచివాలయ సిబ్బంది ద్వారా ఆయా ప్రాంతాల్లో దీని గురించి ప్రజల్లో అవగాహన పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## వాట్సాప్ ద్వారా అర్జీలు ఇవ్వొచ్చు

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు కేవలం ప్రభుత్వం నుంచి సేవలు పొందడమే కాదని, ఫిర్యాదులు, అర్జీలు కూడా పెట్టుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సదుపాయం గురించి ప్రజలకు వివరించాలన్నారు. నిరక్షరాస్యులు కేవలం తమ ఫిర్యాదును వాయిస్ ద్వారా కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వానికి తెలిపే సదుపాయాన్ని త్వరలో కల్పించబోతున్నామని తెలిపారు. పౌరుల్లో డిజిటల్ అక్షరాస్యత పెరిగితే వాట్సాప్ గవర్నెన్స్ ఉపయోగిత కూడా పెరుగుతుందన్నారు. వాట్సాప్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా కూడా ప్రజలు వాట్సాప్ గవర్నెన్స్ ఉపయోగించుకునే సదుపాయం కల్పించే చర్యలు కూడా వేగంగా చేపట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. డేటా లేక్ ఏర్పాటు, డేటా అనుసంధాన ప్రక్రియ కూడా వేగవంతంగా జరగాలన్నారు. డేటా లేక్ ఏర్పాటు చేయడంలో ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తున్న అత్యుత్తమ ప్రమాణాలను పాటించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## నెలాఖరుకు 350 సేవలు

వాట్సాప్ ద్వారా ప్రస్తుతం 200 రకాలైన సేవలు ప్రజలకు అందిస్తున్నామని ముఖ్యమంత్రికి ఐటీ, రియల్ టైమ్ గవర్నెన్స్ కార్యదర్శి భాస్కర్ కాటంనేని వివరించారు. ఈ నెలాఖరులోపు మరో 150అదనపు సేవలు కల్పిస్తామని తద్వారా వాట్సాప్ ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు 350కి చేరుతాయన్నారు. తదుపరి దశలో మొత్తం 500సేవలు కల్పిస్తామన్నారు. మే నెలలో మొదటి దశ డేటా లేక్ ఏర్పాటు పూర్తి చేస్తామని వివరించారు. అలాగే రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను పెద్ద ఎత్తున ఉపయోగించుకుని ఒన్ స్టేట్-ఒన్ యాప్ విధానంలో ప్రజలకు అన్ని సేవలు కేవలం ఒకే ప్లాట్‌ఫాంలో లభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

## అన్న క్యాంటీన్లలో భోజనం భేష్

అన్న క్యాంటీన్లలో భోజనం రుచికరంగా ఉందని ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీపుల్స్ పర్సెప్షన్‌పై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. అన్న క్యాంటీన్ల నిర్వహణపై 90శాతం ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తంచేస్తున్నారని అధికారులు తెలియజేశారు. అన్న క్యాంటీన్లలో వడ్డిస్తున్న భోజనం రుచి, నాణ్యత ఎలా ఉంది అని అడిగిన ప్రశ్నకు భోజనం చాలా బాగుందని 94శాతం మంది ప్రజలు అభిప్రాయపడ్డారు. అన్న క్యాంటీన్లలో పరిశుభ్రత ఎలా ఉంది అని అడిగిన ప్రశ్నకు 96శాతం మంది అన్న క్యాంటీన్లు నీట్‌గా ఉన్నాయని అభిప్రాయపడగా, 4శాతం మంది మాత్రం ఫరవాలేదు అని అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే పింఛన్ల పంపిణీపైన కూడా ప్రజలు సంతృప్తి వ్యక్తంచేశారు. పింఛను పంపిణీ చేసే సిబ్బంది ప్రవర్తనపై 82.5శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఎక్కడైతే ప్రజలు అసంతృప్తి ఎక్కువగా వ్యక్తం చేశారో అక్కడ సమస్యలు ఏమిటి అనేది తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్. సీఎం కార్యదర్శులు ముద్దాడ రవిచంద్ర, పీఎస్ ప్రద్యుమ్న, రాజమౌళి, హోంశాఖ ఐటీ సెల్ ఐజీ శ్రీకాంత్, ఐజీ ఈగల్ ఆర్ కె.రవి కృష్ణ, సీఈఓ వి.కరుణ, ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ ఎం.మాధురి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం చేస్తాం

## సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులకు సీఎం చంద్రబాబు హామీ



అమరావతి (చైన్యరథం): సాయి సాధన చిట్‌ఫండ్స్ బాధితులకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. నరసరావుపేటకు చెందిన సాయి సాధన చిట్‌ఫండ్స్ బాధితులు సీఎం చంద్రబాబును కలిసేందుకు సోమవారం ఆయన నివాసానికి తరలివచ్చారు. సచివాలయం నుండి నివాసానికి వెళుతున్న సీఎం చంద్రబాబు.. బాధితులను చూసి కాన్వాయ్ ఆపి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రూ.250 కోట్లకుపైగా మోసపోయినట్లు సీఎం చంద్రబాబుకు బాధితులు తెలిపారు. 600 కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. 40 రోజుల క్రితమే చిట్‌ఫండ్ యజమాని కోర్టులో లొంగిపోయారని, న్యాయం చేయాలంటూ చంద్రబాబుకు మొర పెట్టుకున్నారు. 10 నిమిషాలపాటు బాధితుల సమస్యలు విన్న చంద్రబాబు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



అనంతరం దీనిపై ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేస్తూ.. సచివాలయం నుంచి ఇంటికి వెళుతున్న సమయంలో ఉండవల్లి నివాసం వద్దకు తరలివచ్చిన చిట్ ఫండ్ బాధితుల సమస్యలు విన్నాను. కష్టపడి సంపాదించుకుని దాచుకున్న మొత్తాన్ని చిట్ ఫండ్ యాజమాన్యం చేసిన మోసం కారణంగా పోగొట్టుకున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పాను. ప్రభుత్వపరంగా తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుని... వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చానని సీఎం చంద్రబాబు తెలిపారు.



# అభ్యసన ఫలితాలే లక్ష్యంగా..

# పాఠశాల విద్యలో సంస్కరణలు

- మంత్రి నారా లోకేష్ స్పష్టీకరణ
- ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను నెం.1గా తీర్చిదిద్దుతాం
- సంస్కరణల అమలులో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం వహించాలి
- జూన్ నాటికి సంస్కరణలు పూర్తి, అక్కడ నుంచి ఫలితాలపైనే దృష్టి
- గతప్రభుత్వ నిర్వాకంతో ప్రభుత్వ స్కూళ్లలో 12లక్షల మంది విద్యార్థుల తగ్గుదల
- లెర్నింగ్ ఎక్సలెన్స్, జీఓ 117 రద్దుపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో మంత్రి లోకేష్ సమావేశం



అమరావతి (చైతన్యరథం): అభ్యసన ఫలితాలే లక్ష్యంగా పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఏపీ (లీప్), జీఓ 117 రద్దు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై కూటమి శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఉండవల్లి నివాసంలో సోమవారం మంత్రి లోకేష్ 3 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యావ్యవస్థలో సమూలన ప్రక్షాళన చేసి, దేశంలోనే ఏపీ విద్యా వ్యవస్థను నెం.1గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయానికి అనుగుణంగా విద్యాశాఖ మంత్రిగా తాను సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.విద్య ద్వారానేసమాజంలో మార్పు సాధ్యమని, తద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించవచ్చని తెలిపారు. విద్యావ్యవస్థ కోట్లాదిమంది జీవితాలపై ప్రభావాన్ని చూపుతుందన్నారు. యువగళం పాదయాత్ర చేస్తున్న సమయంలో జీఓ 117 దుష్ఫలితాల గురించి అనేక మంది నాయకులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారని చెప్పారు. వారంతా ప్రైవేటు స్కూళ్లవైపు మళ్లారని తెలిపారు.గత పాలకుల వైఫల్యాన్ని అసర్ నివేదిక తేటతెల్లం చేసిందని చెప్పారు.

## జాతీయ సగటుకంటే క్షీణత

నేషనల్ అఛీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) నివేదిక ప్రకారం జాతీయసగటుతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ అన్ని తరగతుల్లోనూ గణనీయమైన అభ్యాస అంతరాన్ని ఎదుర్కొంటోంది. 3వ తరగతి విద్యార్థుల్లో లాంగ్వేజెస్‌లో 57 శాతం మంది, గణితంలో 54 శాతం మంది మాత్రమే అంచనా ప్రమాణాలను చేరుకుంటున్నారు. ఇది జాతీయ సగటుకంటే 5 నుంచి 8శాతం తక్కువ. పై తరగతుల్లో ఈ అంతరం మరింత ఎక్కువగా ఉంది.

రాష్ట్రంలోని 70 శాతం జిల్లాలు జాతీయ సగటు కంటే తక్కువ పనితీరు కనబరుస్తున్నాయి. రాష్ట్రంలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) నైపుణ్యాల్లో క్షీణతను అసర్ -2024 నివేదిక తెలియజేస్తోంది. 8వ తరగతి విద్యార్థుల్లో 55 శాతం మంది విద్యార్థులు కనీసం భాగాహారం కూడా చేయలేకపోతున్నారు. 10వ తరగతిలో గ్రేడ్-3 విద్యార్థుల్లో 9 మందికి ప్రాథమిక సంఖ్యా నైపుణ్యాలు కూడా లేవు. పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ) 2021-22నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ విద్య శిక్షణ డొమైన్‌లో 60 పాయింట్లు సాధించింది. ఇది పెద్ద రాష్ట్రాల సగటు 66కంటే తక్కువ. క్లాస్ రూమ్‌ల్లో నాణ్యత మెరుగుపరచడానికి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాల్లో పెట్టుబడి పెట్టవలసిన అవసరాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నాయని మంత్రి లోకేష్ వివరించారు.

## గత ప్రభుత్వ పొరపాటును సరిదిద్దేందుకే జీఓ 117రద్దు

గత ప్రభుత్వం చేసిన పొరపాటును సరిదిద్దేందుకు జీఓ 117ను రద్దుచేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. ఫీజు రీయింబర్స్‌మెంట్, పాఠశాల విద్యలో స్కూల్ బ్యాగ్స్, గుడ్లు, చిక్కీలకు రూ.4,300 కోట్లకు పైగా బకాయిలు పెట్టారు. ఎటువంటి ముందస్తు వ్యూహం లేకుండా సిబిఎస్ఈ, ఐబిల పేరుతో హడావిడి చేశారు. సిబిఎస్ఇ విధానం ప్రవేశపెట్టిన పాఠశాలల విద్యార్థులకు మాక్ టెస్ట్ నిర్వహిస్తే 90శాతం మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. ఐబి నివేదిక పేరుతోనే రూ.5కోట్లు దుర్వినియోగం చేశారు.పిల్లల భవిష్యత్తుతో కూడుకున్న అంశమైనందున ప్రజాప్రతినిధులంతా పాఠశాలలపై దృష్టి పెట్టాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరం కలసికట్టుగా పనిచేస్తేనే సంస్కరణల అమలు సాధ్యమవుతుంది. అంతిమంగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి ఫలితాలను సాధించాలి. విలువలతో కూడిన విద్యాబోధన జరగాలని మంత్రి లోకేష్ అన్నారు.

## ఉత్తమ పద్ధతుల అధ్యయనానికి విదేశాలకు టీచర్లు

అంతర్జాతీయంగా వస్తున్నమార్పులపై అధ్యయనం చేసేందుకు ఎంపికచేసిన ఉపాధ్యాయులను పోలాండ్ వంటి ఇతర దేశాలకు పంపిస్తాం. దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో నియోజకవర్గానికి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తాం. పాసివ్ లెర్నింగ్ నుంచి యాక్టివ్ లెర్నింగ్‌కుమారాలి.రాబోయే ఐదేళ్లలో అన్ని ప్రభుత్వపాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్స్, బెంచీలు, తాగునీరు, టాయ్‌లెట్లు వంటివి పూర్తిస్థాయిలో ఏర్పాటుచేస్తాం.ప్రభుత్వ నిధులతోపాటు శాసన సభ్యులు నియోజకవర్గ స్థాయిలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను సమీకరించి స్కూళ్లలో సౌకర్యాల మెరుగుదలకు కృషిచేయాలి.కేవలం అకడమిక్ అంశాలపైనే గాక విద్యేతర అంశాలపై కూడా దృష్టిపెట్టాలి. స్కూలుస్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు స్పోర్ట్స్ లీగ్‌లు, సైన్స్ ఫేర్‌లు నిర్వహిస్తాం. స్కూళ్లలో ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ సేవలువంటివాటిలో విద్యార్థులను భాగస్వాములను చేస్తాం. గంజాయి,డ్రగ్స్ నివారణకు డ్రగ్స్‌వద్దు బ్రోపేరుతో పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు, ఈగల్ క్లబ్బులు ఏర్పాటుచేస్తున్నాం. ప్రతి కుటుంబానికి విద్య,వైద్యం అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. జూన్ నాటికి సంస్కరణలు పూర్తిచేసి, ఆ తర్వాత రాబోయే నాలుగేళ్లు లెర్నింగ్ అవుట్ కమ్స్‌పైనే దృష్టిసారిస్తామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. జీఓ 117 కారణంగా జరిగిన నష్టాలు, ప్రత్యామ్నాయ ముసాయిదాను పాఠశాలవిద్యకార్యదర్శి కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజు ప్రజాప్రతి నిధులకు వివరించి,వారి అభిప్రాయాలను తీసుకున్నారు. సమావేశంలో ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా, సర్వశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఎండి గణేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.










చైతన్యరథం

# ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్

అమరావతి (చైతన్యరథం): ఈనెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఉండవల్లి నివాసంలో సోమవారం కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో.. సంస్కరణల అమలుకు సంబంధించి పాఠశాల విద్యలో తేనున్న మార్పులపై మంత్రి లోకేష్ వివరించారు. ఈ ఏడాది క్లస్టర్ రీ మ్యాపింగ్, జీఓ 117 రద్దు, టీచర్స్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్, ఉపాధ్యాయుల పదోన్నతులు, మౌలిక సదుపాయాల ఏర్పాటుపై రూట్ మ్యాప్ ఇచ్చారు. సంస్కరణలు పకడ్బందీగా అమలు చేయగలిగితే వచ్చే ఏడాది నుంచే ఫలితాలు ప్రారంభమవుతాయని చెప్పారు. సంస్కరణలను లాజికల్‌గా ముందుకు తీసుకెళ్లాల్సి ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా విద్యారంగాన్ని ముందుకు తీసుకెళుతున్నామని, ఇందులో భాగంగా యూనిఫామ్స్, బుక్స్, అకడమిక్ కేలండర్‌పై ఎక్కడా పార్టీ ఫ్లేవర్ లేకుండా చేశామని చెప్పారు. శాసనసభ్యుల విజ్ఞప్తిపై పాఠశాలల్లో వార్షికోత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు.




- కేజీ టూ పీజీ పాఠ్య పుస్తకాల్లో మార్పులు
- పాఠశాలల్లో వార్షికోత్సవాల నిర్వహణ
- కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో మంత్రి లోకేష్

## ఎమ్మెల్యేల చొరవ కూడా అవసరం

జీఓ 117రద్దు నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సంబంధించి శాసనసభ్యులు చొరవచూపాల్సి ఉందని మాజీమంత్రి కొణతల రామకృష్ణ సూచించారు. పాఠశాలల్లో కనీస సంఖ్యలో విద్యార్థులు ఉండేలా వారు చొరవచూపితే ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ విధానం అమలవుతుందని తెలిపారు. మరో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ... శివారు గ్రామాలు ఎక్కువగా ఉన్నచోట్ల ట్రాన్స్‌పోర్టేషన్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. జనసేన శాసనసభ్యురాలు లోకం మాధవి మాట్లాడుతూ... మోడల్ ప్రైమరీ స్కూలుకు కనీస విద్యార్థుల సంఖ్య 45గా నిర్ణయించాలని కోరారు. కొవ్వూరు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... గురుకుల పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వస్తున్నందున వాటిని పెంచే అంశాన్ని పరిశీలించాలని అన్నారు. కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ... ప్రభుత్వ స్కూళ్లు, కళాశాల విద్యార్థులకు ఎంసెట్, ఐఐటి వంటి కోచింగ్ నిర్వహించాలని విజ్ఞప్తిచేశారు.

దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ ఇప్పటికే ఇంటర్ విద్యార్థులకు ఇన్‌పుట్ మెటీరియల్స్ అందజేస్తున్నామని, కోచింగ్ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడతూ... జీఓ 117పై కలెక్టర్లు, సబ్ కలెక్టర్లతో సమావేశం ఏర్పాటుచేసి, సమన్వయం చేసే బాధ్యత అప్పగించాలన్నారు.

## గిరిజన ప్రాంతాల స్కూళ్లపై శ్రద్ధవహించండి

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వస్కూళ్లలో సౌకర్యాలపై బ్రాండింగ్ చేయాలని అన్నారు. విశాఖ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ... కార్పొరేషన్ పరిధిలోని పెద్ద హైస్కూళ్లలో ఇండోర్ స్టేడియాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ స్కూళ్లలో సీట్లు కావాలని మా వద్దకు రికమండేషన్ లెటర్ల కోసం తల్లిదండ్రులు వచ్చే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ... డీసీసీబీల్లో ఉన్న సీజీఎఫ్ నిధులను సర్కారీ స్కూళ్లలో మౌలిక సదుపాయాలకోసం వినియోగించాలని సూచించారు. ఎన్ఆర్ఐలు సాయం అందించడానికి ఆన్‌లైన్ విధానాన్ని చేపట్టాలని అన్నారు. మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ... గిరిజన ప్రాంతాల్లో స్కూళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ.... గతంలో స్కూలు యూనిఫామ్స్‌కు వాలీచాలని విధంగా క్లాత్ ఇచ్చారని, 3 జతలకు సరిపడా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... వైసీపీ పాలనలో ప్రభుత్వ స్కూళ్ల ఇమేజ్ పడిపోయిందని తెలిపారు. స్కూళ్లు, కళాశాలల్లో వార్షికోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.... అదనపు తరగతి గదుల నిర్మాణానికి కాంప్రెహెన్సివ్ ప్లాన్ అమలుచేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ... సంస్కరణల అమలులో తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని కోరారు.

# ఫేక్ ప్రచారాలతో వాస్తవాలు దాచలేరు

- వైసీపీకి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా కౌంటర్
- ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన గాదె శ్రీనివాసులుకు శుభాకాంక్షలు



అమరావతి (చైతన్యరథం): ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా విజయంసాధించిన గాదె శ్రీనివాసులు నాయుడుకు తెలుగుదేశం పార్టీ తరపున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈక్రమంలో వచ్చిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి గాదె శ్రీనివాసులు విజయం సాధించారన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారంలో మా కూటమి ప్రభుత్వం అన్నివేళలా సహకరిస్తుందని తెలియజేశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ కానీ, కూటమికానీ పోటీ చేయలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ ఈ ఫలితాన్ని టీడీపీ, కూటమి ఓటమిగా అభివర్ణించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఫేక్ ప్రచారాలతో వాస్తవాలను దాచలేరని వైసీపీ నేతలు తెలుసుకోవాల్సిన అవసరం ఇకనైనా ఉందని పల్లా హితవు పలికారు.

### ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై

# వైసీపీ మీడియా దుష్ప్రచారం

మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజం



అమరావతి (చైతన్యరథం): ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై వైసీపీ మీడియా దుష్ప్రచారం చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. అవాస్తవాలు, అబద్ధాలతో పబ్బం గడుపుకునే వైసీపీ లాంటి పార్టీ ఉండటం దురదృష్టకమన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయలేదని స్పష్టం చేశారు. శ్రీనివాసులు నాయుడు, రఘువర్మ.. ఇద్దరి అభ్యర్థిత్వాలకు టీడీపీ శ్రేణులు మద్దతు ఇచ్చాయని తెలిపారు. టీడీపీ శ్రేణులు.. శ్రీనివాసులు, రఘువర్మకు ప్రథమ, ద్వితీయ ప్రాధాన్యత ఓటు వేశారన్నారు. వాస్తవం ఇలా ఉంటే ఎమ్మెల్సీల ఎన్నికల ఫలితంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. పోటీ చేసిన రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను టీడీపీ బంపర్ మెజారిటీతో గెలుస్తోందని హర్షం వ్యక్తం చేశారు. కనీసం అభ్యర్థులను కూడా పోటీలో పెట్టలేని దయనీయ స్థితిలో వైసీపీ ఉందని మంత్రి అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి హవా!

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపు బాటలో కూటమి అభ్యర్థులు
- ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల స్థానంలో ఆలపాటికి భారీ మెజారిటీ
- గోదావరి జిల్లాల్లో ముందంజలో పేరాబత్తుల
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు గెలుపు



ఆలపాటి, పేరాబత్తుల



గాదె శ్రీనివాసులు నాయుడు

అమరావతి (చైతన్యరథం): ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కూటమి హవా కొనసాగింది. ఎన్నికలు జరిగిన రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం దిశగా దూసుకెళుతున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పోటీ చేయనప్పటికీ, టీడీపీ శ్రేణుల మద్దతుతో పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపొందారు.

కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ భారీ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. నాలుగో రౌండ్ ముగిసే సరికి ఆలపాటి 38,612 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఈ రౌండ్‌లో ఆలపాటికి 16,286 ఓట్లు, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు 7,850 ఓట్లు వచ్చాయి.

మొదటి రౌండ్‌లో ఆలపాటికి 17,246 ఓట్లు, రెండో రౌండ్లో 17,506 ఓట్లు, మూడో రౌండ్లో 16,723 ఓట్లు చొప్పున రాగా...లక్ష్మణరావుకు మొదటి రౌండ్‌లో 7156, రెండో రౌండ్లో 6,740, మూడో రౌండ్లో 7403 చొప్పున ఓట్లు సాధించారు.

ఆలపాటి రాజా తొలిరౌండ్‌లో 10,090, రెండో రౌండ్‌లో 10766, మూడో రౌండ్‌లో 9320, నాలుగో రౌండ్‌లో 8436 ఓట్ల మెజారిటీ సాధించారు.

మొత్తంగా తొమ్మిది రౌండ్లు కాగా.. ఒక్కో రౌండ్లో 28వేల చొప్పున ఓట్లు లెక్కిస్తున్నారు.

## గోదావరి జిల్లాల స్థానంలో..

ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుపై మొదటి రౌండ్‌లోనే 18 వేల మెజారిటీ వచ్చింది. ఏలూరు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న లెక్కింపులో ఉదయం 11గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. మొత్తంగా 243 పోస్టల్ బ్యాలెట్లకు గాను 201 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చెల్లగా.. 42 చెల్లనివిగా గుర్తించారు. ఆ తర్వాత జనరల్ బ్యాలెట్ ఓట్లలో చెల్లుబాటైనవి, కానివిగా విడదీశారు. బ్యాలెట్లను కట్టలు కట్టేందుకు 12గంటల సమయం పట్టింది. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తంగా 2,18,902 ఓట్లు పోల్ అవ్వగా.. మొత్తం 8 రౌండ్లలో ఫలితాలు వెలువడనున్నాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో దాదాపు 700మంది కౌంటింగ్ సిబ్బంది మూడు షిఫ్టుల్లో పాల్గొంటున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు.

## ఉత్తరాంధ్ర టీచర్ స్థానం గాదె శ్రీనివాసులుదే..

విశాఖలోని ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో దాదాపు 11గంటల పాటు నిరంతరాయంగా కొనసాగిన ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించారు. ఏపీటీఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మపై ఆయన రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలుపొందారు. శ్రీకాకుళం- విజయనగరం-విశాఖ ఎమ్మెల్సీ స్థానంలో పది మంది పోటీ చేయగా.. ఎనిమిది మందిని ఎలిమినేట్ చేయడంతో శ్రీనివాసులు నాయుడు విజయం ఖాయమైంది. ఉత్తరాంధ్రలో మొత్తంగా 20,783 ఓట్లకు గాను 19,813 ఓట్లు మాత్రమే చెల్లనివిగా అధికారులు గుర్తించారు. దాదాపు 1000కి పైగా ఓట్లు చెల్లనివిగా మిగిలాయి. ఈ స్థానానికి మ్యాజిక్ నంబర్ 10,068 ఓట్లుగా ఉండగా.. తొలి నుంచి ఆధిక్యంలో కొనసాగిన పీఆర్టీయూ అభ్యర్థి శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు.

చైతన్యరథం

# పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలపై దృష్టి

- దశలవారీగా స్కూళ్లలో ప్రహరీగోడల నిర్మాణం
- నాడు-నేడు అక్రమాలపై విచారణ జరిపి చర్యలు
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి ప్రహరీగోడల నిర్మాణానికి రూ.3వేల కోట్లు అవసరం, ఉపాధి హామీ, మన బడి- మన భవిష్యత్తు నిధుల కన్వర్జెన్స్‌తో దశలవారీగా ప్రహరీగోడల నిర్మాణం చేపడతామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ గోడల నిర్మాణం, నాడు-నేడు అక్రమాలు, అసంపూర్తిగా నిలచిపోయిన భవనాలు, కనీస మౌలిక సదుపాయాలు, డ్రగ్స్ నివారణపై శాసనసభ్యులు అదితి గజపతిరాజు (విజయనగరం), మిరియాల శిరీషకుమారి (రంపచోడవరం), బండారు శ్రావణి శ్రీ (శింగనమల), పల్లె సింధూర రెడ్డి (పుట్టపర్తి) అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సోమవారం సమాధానమిస్తూ... ఇటీవల మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో పాఠశాలల్లో మౌలిక వసతులు, ఫలితాలపై స్టార్ రేటింగ్ ఇచ్చాం. కనీస మౌలిక సదుపాయాలు లేని 1,2 స్టార్ రేటింగ్ పాఠశాలలల్లో లీక్ ప్రూఫ్ భవనాలు, బెంచిలు, టాయ్‌లెట్లు, తాగునీరు వంటి కనీస వసతుల కల్పనపై దృష్టిపెట్టాం. ఈ విషయమై శాసనసభ్యులతో సమావేశం కూడా ఏర్పాటు చేస్తున్నాం. గత ప్రభుత్వం 117 జీఓతో నిరుపేద పిల్లలకు విద్యను దూరం చేసింది. గత ప్రభుత్వ నిర్వాకంతో ప్రభుత్వ స్కూళ్లలో 12లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. 117 జీఓకు ప్రత్యామ్నాయంపై ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చిస్తున్నాం. నాడు-నేడులో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులకు సంబంధించి వివరాలు సేకరించి, వాటిని పూర్తిచేస్తాం. 117 జీవోకు ప్రత్యామ్నాయంపై చర్చించిన తర్వాత టీచర్ల బదిలీలు, మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వం చేపట్టిన నాడు - నేడు పనులపై అనేక ఆరోపణలు వచ్చాయి, 117 జీఓ కారణంగా పనులు ప్రారంభించిన కొన్ని పాఠశాలలు మూతపడ్డాయి. నాడు-నేడు అవతకవకలపై నివేదిక తెప్పించుకుని, సభ్యులతో చర్చించిన తర్వాత చర్యలు తీసుకుంటాం. రంపచోడవరం నియోజకవర్గంలో 80 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పించాల్సి ఉంది. ఇక్కడ ప్రత్యేక పథకం ద్వారా మౌలిక సదుపాయాలు పూర్తిచేస్తాం. కెజిబివిలకి సంబంధించి నూరుశాతం ప్రహరీ గోడలను ఈ సంవత్సరం డిసెంబర్ లోగా పూర్తిచేస్తాం. రాబోయే 3నెలల్లో సీసీ కెమెరాలు, లైటింగ్ ఏర్పాటుచేస్తాం. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వంతోపాటు సభ్యులంతా బాగస్వాములు కావాలి. పాఠశాలలకు స్టార్ రేటింగ్ తోపాటు లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) ప్రోగ్రామ్‌లో సంస్కరణలు తెస్తున్నాం. సభ్యులు వారి నియోజకవర్గాల్లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద నిధులు సమీకరించుకొని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషిచేసి, స్టార్ రేటింగ్ మెరుగు పర్చాలి. అందరూ కలసికట్టుగా ప్రహరీగోడలు, బేసిక్ ఇన్ ఫ్రా కు చొరవచూపాలి. రాబోయే ఐదేళ్లలో ప్రభుత్వ స్కూళ్లలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి నారా లోకేష్ చెప్పారు.

డ్రగ్స్ నివారణకు చేపడుతున్న చర్యలపై లోకేష్ సమాధానమిస్తూ... డ్రగ్స్ వద్దు బ్రో అనే క్యాంపెయిన్ చేపడుతున్నాం. గంజాయి కారణంగా ఒక తరం ఎలా నాశనమవుతుందో తెలియజెప్పి, విద్యార్థుల్లో చైతన్యం కలిగించేందుకు ప్రతిపాఠశాలలో ఈగల్ క్లబ్స్ ఏర్పాటుచేస్తున్నాం. వీటిని రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కాలేజీల్లో ఏర్పాటు చేస్తాం. పదోతరగతి, ఇంటర్ పరీక్షల తర్వాత ఈ క్లబ్బులను యాక్టివేట్ చేస్తామన్నారు.



# త్వరలోనే మెగా డీఎస్సీ ప్రకటన

**- అసెంబ్లీలో మంత్రి నారా లోకేష్ వెల్లడి**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 16,347 టీచర్ పోస్టుల భర్తీకి త్వరలోనే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. వైసీపీ సభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ (యర్రగొండపాలెం), ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి (రాజంపేట), రేగం మత్స్యలింగం (అరకు), బి.విరూపాక్షి (ఆలూరు) పంపిన ప్రశ్నకు మంత్రి లోకేష్ శాసనసభలో సోమవారం సమాధానమిచ్చారు. ఇదిలా వుండగా... గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల హయాంలో ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయలేదు. గత 30ఏళ్లలో టీడీపీ ప్రభుత్వాల హయాంలో 13 డీఎస్సీలను నిర్వహించి, 1,80,272 టీచర్ పోస్టులను భర్తీచేశారు. రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ లో 2014-19 నడుమ



చంద్రబాబునాయుడు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం 2014, 18, 19ల్లో మూడు డీఎస్సీల నిర్వహణ ద్వారా 16,701 టీచర్ పోస్టులను భర్తీచేసింది. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి గణాంకాల వివరాలు ఇలా ఉన్నాయి.

**DSC Recruitment @ TDP Period**

| S.No | Year | Recruitment | Type |
|---|---|---|---|
| 1 | 1994 | 16238 | Regular Recrument (173171) |
| 2 | 1996 | 16838 | |
| 3 | 1998 | 29269 | |
| 4 | 2000 | 24388 | |
| 5 | 2001 | 26129 | |
| 6 | 2002 | 31699 | |
| 7 | 2003 | 12430 | |
| 8 | 2014 | 8926 | |
| 9 | 2018 | 7254 | |
| 10 | 1995 | 3706 | Limited Recruitment (3706) |
| 11 | 1996 | 2000 | Special Recruitment (7101) |
| 12 | 1997 | 874 | |
| 13 | 2019 | 521 | |
| Grand Total | | | 180272 |

# సీఎం ఛాంబర్‌కు డిప్యూటీ సీఎం పవన్

- గంటపాటు భేటీ
- వివిధ అంశాలపై చర్చ

అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర బడ్జెట్, వివిధ శాఖలకు కేటాయింపులపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చర్చించారు. అసెంబ్లీలో సోమవారం సీఎం చంద్ర బాబు ఛాంబర్‌కు వెళ్లిన పవన్ కల్యాణ్ వివిధఅంశాలపై చర్చించారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను బ్యాలెన్స్ చేస్తూ కేటాయింపులు ఉన్నాయని పవన్ అభిప్రాయ పడ్డారు. మే నుంచి ప్రారంభించే తల్లికి వందనం, అన్నదాత పథకాలపై భేటీలో చర్చించారు. అలాగే, ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల ఎన్నికపైన ఇద్దరి నేతల మధ్య చర్చ జరిగింది. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక పైనా సమావేశంలో చర్చించారు. అసెంబ్లీ లోని చంద్రబాబు ఛాంబర్‌లో దాదాపు గంట పాటు ఇద్దరి నేతల భేటీ జరిగింది.

**చెట్టు విరిగిపడిన ఘటనలో**

# చిన్నారి శ్రీలేఖ మృతి బాధాకరం

**- కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి లోకేష్ హామీ**

అమరావతి (చైతన్యరథం): కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం పోలకల్ జిల్లాపరిషత్ హైస్కూలు ఆవరణలో ఇటీవల దురదష్టవశాత్తు చెట్టు విరిగిపడిన ఘటనలో గాయాలపాలైన 8వ తరగతి విద్యార్థిని శ్రీలేఖ (14) చికిత్సపొందుతూ మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ విచారం వ్యక్తం చేశారు. చిన్నారి శ్రీలేఖ మృతితో ఆమె తల్లిదండ్రులకు కలిగిన నష్టం తీర్చలేనిదన్నారు. శ్రీలేఖ కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

# టెన్త్ హాల్ టిక్కెట్లు సిద్ధం ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

**- ఎక్స్‌లో మంత్రి నారా లోకేష్**

అమరావతి (చైతన్యరథం): పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం హాల్ టిక్కెట్లను సోమవారం మధ్యాహ్నం 2:00 గంటల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా హాల్ టిక్కెట్లు పొందవచ్చున్నారు. అదే విధంగా ఎంవ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో స్కూల్ లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రకటించారు. వాట్సాప్‌లోని మనమిత్ర ద్వారా (9552300009)ఎడ్యుకేషనల్ సర్వీస్‌ను సెలెక్ట్ చేయడం ద్వారా హాల్ టికెట్లు పొందవచ్చని స్పష్టం చేశారు. అప్లికేషన్ నెంబర్ లేదా విద్యార్థి ఐడీ, జన్మదిన తేదీ ద్వారా హాల్ టికెట్లు పొందవచ్చని చెప్పారు. ఈ మేరకు



సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు. ఆల్ ది బెస్ట్, ప్రతిభ చాటుతూనే ఉండండి.. అని మంత్రి లోకేష్ ట్వీట్ చేశారు.

# బాలయోగి జీవితం స్ఫూర్తిదాయకం

**- మంత్రి లోకేష్ నివాళి**

అమరావతి:దేశంలోనే అత్యున్నతమైన లోక్‌సభ తొలి దళిత స్పీకర్‌గా సేవలందించి దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన కోనసీమ ముద్దుబిడ్డ, టీడీపీ నేత స్వర్గీయ జీఎంసీ బాలయోగి వర్ధంతి సందర్భంగా సోమవారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఘన నివాళులు అర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన మహోన్నత వ్యక్తి బాలయోగి అని, సామాన్య కుటుంబంలో జన్మించి అత్యున్నతమైన లోక్‌సభ స్పీకర్‌గా ఎదిగిన బాలయోగి జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. రాష్ట్రానికి, దేశా నికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ బాల యోగి ఆశయసాధనకు ప్రతి ఒక్కరం



పునరంకిత మవుదామని మంత్రి లోకేష్ పిలుపిచ్చారు.

చైతన్యరథం

# రైతులకు పగటి పూటే 9 గంటల విద్యుత్

- పీఎం కుసుమ్ కింద మరో రెండు లక్షల కనెక్షన్లు
- త్వరలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తాం
- కనెక్షన్లు, ఉచిత విద్యుత్‌కు ఏటా రూ.12,400 కోట్లు
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి(చైతన్యరథం): రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా వ్యవసాయ ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శాసనసభలో విద్యుత్ శాఖకు సంబంధించి సభ్యులు బత్తుల బలరామకృష్ణ, ఉగ్ర నరసింహారెడ్డి, బండారు సత్యానందరావులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సోమవారం సమాధానమిచ్చారు. ఈ కూటమి ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు, ఉచిత విద్యుత్‌కు ఏడాదికి రూ.12,400 కోట్లకు పైగా వ్యయం చేస్తుందని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే 22,709 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పిన ఆయన మొత్తం 69,975 కనెక్షన్లను మంజూరు చేశామని స్పష్టం చేశారు. ఒక్కో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం కూటమి ప్రభుత్వం రూ.2.60 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వివరిం చారు. డిస్కంలలో విద్యుత్ ఉపకరణాల ధరలు తేడా ఉండడంపై స్పందించారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిందని మంత్రి విమర్శించారు. స్థంభాలు, ట్రాన్స్‌మిషన్ లైన్లను అత్యధిక ధరలకు కొనుగోలు చేయడంతో మూడు డిస్కంల పరిధి లోని ధరల్లో వ్యత్యాసం ఏర్పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉపకరణాల కొనుగోలు ధరల్లో మార్పులు లేకుండా స్థిరీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు.

### పీఎం కుసుమ్ గటి పూటే రైతులకు నిరంతర ఉచిత విద్యుత్

పీఎం కుసుమ్ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రైతులకు పగటి పూట పూర్తిస్థాయి విద్యుత్ సరఫరాలో కొన్ని ఆటంకాలు ఏర్పడిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి సభలో ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం పీఎం కుసుమ్ పథకం ద్వారా



అతి త్వరలోనే రైతులకు 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 4.50 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అవసరమని అంచనా వేసిన మంత్రి...ఇప్పటికే లక్ష పీఎం కుసుమ్ కనెక్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. మరో రెండు లక్షల కనెక్షన్లకు సంబంధించి కేంద్రం సానుకూలంగా స్పందిం చిందని చెప్పారు. వీటికి సంబంధించి త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలు పెడుతు న్నామని వివరించారు.

### అల్యూమినియం ట్రాన్స్‌ఫార్మర్లతో దొంగతనాలకు అడ్డుకట్ట

రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలనూ పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. లో ఓల్టేజ్‌తో పాటు అధిక లోడ్ సమస్యలను పరిష్కరించేందుకు మూడు డిస్కంల పరిధిలో త్వరలోనే 70 సబ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పల్నాడు, ప్రకాశం, బాపట్ల ప్రాం తాల్లో జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలను నిలువరించడానికి ప్రత్యేక ఏర్పా ట్లు చేస్తున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే రాగి వైరు కోసమే దొంగతనాలు జరు గుతు న్నాయని తెలిపారు. ఇకపై అల్యూమినియం ట్రాన్స్‌ఫార్మర్లను వినియోగించే విధం గా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల విష యంలో వెంటనే కేసులు నమోదు అయ్యేలా చూడాలని పోలీస్ సిబ్బందికి సూచిం చామని వివరించారు. రాబోయే వ్యవసాయ సీజన్ సమయానికి రైతులకు విద్యుత్ పరంగా ఎటువంటి ఇబ్బందీ లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

# అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు

- ఇప్పటికీ 70,238 మంది నుంచి దరఖాస్తులు
- జగనన్న ఇళ్ల పథకంలో అవకతవకలు నిగ్గు తేలుస్తాం
- మండలిలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



అమరావతి(చైతన్యరథం): పేదలందరికీ ఇళ్ల పథకం కింద రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలను ఇవ్వాలని నిర్ణయించినట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ప్రతి పేదవాడికి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉండడానికి ఇళ్లు ఉండాలనేది టీడీపీ విధానమని, అందులో భాగంగానే కూటమి ప్రభుత్వం పేదలకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత నెలలో ఇందుకు సంబంధించి జీవో ఇవ్వగా ఇప్పటివరకు 70,238 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుదారులెందరో లెక్క తేలిన తర్వాత ప్రభుత్వ భూములు ఉన్న చోట కేటాయిస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములు లేకుంటే ప్రైవేట్ భూములు సేకరించి ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పా రు. సోమవారం శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు రాజశేఖర్, హనుమంతరావు తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం 30 లక్షల పైగా ఇళ్ల పట్టాలు ఇచ్చిందని చెప్పగా దాన్ని మంత్రి అనగాని ఖండించా రు. 22 లక్షల పట్టాలు మాత్రమే ఇవ్వగా అందులో ఏడు లక్షల మంది ఆపట్టాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ముందు కు రాలేదని.. వారంతా ఎవరని ప్రశ్నించారు. వీరు నిజంగా అర్హులైతే రిజి స్ట్రేషన్ చేయించుకోవడానికి ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం సెంటు స్థలం మాత్రమే ఇవ్వగా మా ప్రభుత్వం రెండు, మూడు సెంట్ల స్థలం ఇవ్వ నుందని చెప్పారు. అంతేకాక ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల సాయాన్ని అందిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం కేవలం రూ.2.5 లక్షలు మాత్రమే అది కూడా కేంద్ర ప్రభుత్వం నిధులనే ఇచ్చారని చెప్పారు. జగనన్న ఇళ్ల పథకం పెద్ద కుంభకోణంలా మారింది.. లబ్ధిదారుల ఎంపికలో పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడ్డారు.. ధనవంతులు, ఉద్యోగులు, పార్టీ కార్యకర్తలు, అనుయాయులకు ఇళ్ల పట్టాలు పంచి పెట్టారు.. ఇళ్ల పట్టాల కోసం భూముల కొనుగోలులో పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడ్డారు..నివాస యోగ్యం కాని భూములను, శశ్మానాలు, డంపింగ్ యార్డులు పక్కనున్న భూములను, వర్షం వస్తే మునిగిపోయే భూములను రెండింతలు, మూడింతలు అధిక ధరలకు ప్రభుత్వంతో కొని పించారని తెలిపారు. మొత్తం రూ.10,500 కోట్లతో 26 వేల ఎకరాల ప్రైవేట్ భూముల ను కొనుగోలు చేస్తే ఇందులో వేల కోట్లు వైసీపీ నేతలు, కార్యకర్తల జేబుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. జగనన్న ఇళ్ల పథకంలో జరిగిన అవకతవకలు నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం మాత్రం పేదలకు మేలు చేయాలనే లక్ష్యంతోనే అందరికీ ఇళ్ల పథకాన్ని చేపట్టిందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద వాడికి ఇంటి పట్టా ఇచ్చి ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసు కుంటుందని స్పష్టం చేశారు.

## భవనాల నిర్మాణాలకు
# అనుమతులు సులభతరం

- స్వీయ ధృవీకరణ పత్రం ఇస్తే సరిపోతుంది
- ఏపీడీఎంఎస్ పోర్టల్‌లో అందుబాటులో సేవలు
- మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ



అమరావతి(చైతన్యరథం): భవన నిర్మాణదారులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై 18 మీటర్ల లోపు లేదా ఐదంతస్తుల లోపు భవనాల నిర్మాణాల అనుమతులకు స్వీయ ధృవీకరణ పత్రం ఇస్తే సరి పోతుంది. టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి అవసరం లేకుండానే భవన నిర్మాణాలకు పర్మి షన్ వచ్చేస్తుంది. కాకపోతే భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్‌టీపీలు, ఇంజినీర్లు లేదా ఆర్కిటెక్ట్‌ల సమక్షంలో సరైన పత్రాలు సమర్పించి స్వీయ ధృవీకరణ(అఫిడవిట్) ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి గత నెలలోనే భవన నిర్మాణ అనుమతులకు కొత్త విధానం అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగిం ది. భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను త్వరితగతిన జారీ చేసేలా ఈ కొత్త విధానాన్ని సర్కార్ అందు బాటులోకి తీసుకొచ్చింది. సెల్ఫ్ సర్టిఫి కేషన్ ద్వారా నిర్మాణాలకు అనుమతు లిచ్చేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను ఏపీడీపీఎం ఎస్ పోర్టల్‌లోకి అందు బాటులోకి తీసుకొచ్చినట్లు పురపాలక మంత్రి నారాయణ తెలిపారు. ఈ విధానం ఆమోదం పొందిన లేఅవుట్లు, గ్రామ కంఠం, సర్వులేషన్ ప్లాన్లు ఉన్న ప్రాంతాలు, 1985కు ముందు నిర్మించిన భవనాల పునర్నిర్మాణానికి ఉపయోగపడుతుందని చెప్పారు.

# క్రీడల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులివ్వండి

## ఇన్ఫోసిస్ కన్సల్టెంట్‌కు రవినాయుడు వినతి

అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఏపీలో క్రీడల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు సమకూర్చడమే లక్ష్యంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు సోమవారం హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ సంస్థ లీడ్ కన్సల్టెంట్ ఎం.వంశీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ఇన్ఫోసిస్ నుంచి సీఎస్ఆర్ నిధులను కేటాయించి సహకరించాలని కోరారు. తమ వినతికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

అమరావతి (చైతన్యరథం): ఏపీలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల కు నోటిఫికేషన్ విడుదలయింది. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ దాఖలుకు అవకాశముంటుంది. 11న నామినేషన్ల పరిశీలన, 13 నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఈ నెల 20న పోలింగ్ జరగనుండగా అదే రోజుసాయంత్రం కౌంటింగ్ నిర్వహిస్తా రు. జంగా కృష్ణమూర్తి, దువ్వారపు రామారావు, బీటీ నాయుడు, అశోక్ బాబు, యనమల రామకృష్ణుడుల పదవి కాలం ఈ నెల 29తో ముగియ నుంది.

దీంతో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు సీఈఓ వివేక్ యాదవ్ నోటిఫికేషన్ విడుదలచేశారు. కాగా ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధి కారిగా అసెంబ్లీ డిప్యూటీ సెక్రటరీ ఆర్ వనితా రాణిని ఎన్నికల కమిషన్ నియ మించింది. మరో ఇద్దరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కూడా నియా మించింది. సోమవారం నుంచే ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు స్వీకరి స్తారని సీఈఓ వివేక్ యాదవ్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

# వైసీపీ పాలనలో ఏపీ గంజాయిమయం

- నిర్మూలన కోసమే ప్రత్యేక 'ఈగల్' విభాగం
- 11 వేల ఎకరాల్లో సాగును నియంత్రించాం
- ప్రతి జిల్లాలో నార్కోటిక్ సెల్స్ ఏర్పాటు
- ఇప్పటివరకు 40,088 కిలోల స్వాధీనం
- ఫిర్యాదులకు 1972 టోల్ ఫ్రీ నెంబర్
- పంజాబ్, యూపీ విధానాలపై అధ్యయనం
- విశాఖ వేదికగా సమన్వయ సదస్సు నిర్వహిస్తాం
- నిదాన్ పోర్టల్‌లో పేరుంటే కఠిన చర్యలు
- అసెంబ్లీలో హోంమంత్రి వంగలపూడి అనిత



అమరావతి(చైతన్యరథం): గత వైసీపీ పాలనలో ఏపీని గంజాయిమయం చేశారని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా సోమవారం ఎమ్మెల్యేలు రెడ్డప్పగారి మాధవిరెడ్డి, గల్లా మాధవి, తెనాలి శ్రావణ్‌కుమార్, పల్లా శ్రీనివాస్ తదితర సభ్యులడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. గత ప్రభుత్వంలో ఏపీలో పంటల సాగు కన్నా గంజాయి సాగు,రవాణా ఎక్కువజరిగిందని వివరి స్తూ కూటమి ప్రభుత్వంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. 11 వేల ఎకరాల్లో జరుగుతున్న గంజాయి సాగును కూకటివేళ్లతో పెకిలించి 100ఎకరాలకు నియంత్రించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 40,088కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు వాటికి సంబంధించిన 564వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి సాగు, రవాణా, డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక 'ఈగల్' వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున 26 నార్కోటిక్ సెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీలోని ఏడు మండలాల్లోని 375గ్రామాల్లో 20హాట్ స్పాట్‌లను గుర్తించి గంజాయి సాగును అంతమొందించినట్లు తెలిపారు. రికార్డుస్థాయిలో 46లక్షల గంజాయి మొక్కలను వేళ్లతో సహా తొలగించడమే అందుకు నిదర్శనమన్నారు. గంజాయి సాగుకు అలవాటుపడిన కుటుంబాలను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 359 కుటుంబాలు ఇపుడు గంజాయికి బదులు ఇతర పంటలను పండిస్తున్నాయని వివరించారు. పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి రవాణాను అరికడుతున్నామని చెప్పారు.

### లోకేష్ చొరవతో స్కూళ్లలోనూ ఈగల్ కమిటీలు

హోం, ఈగల్ ఆధ్వర్యంలో అంతర్గత సమన్వయ సమావేశం కోసం స్టేట్ లెవల్ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. డ్రై గంజాయి, లిక్విడ్ గంజా యి, గ్లూస్, వైట్నర్ వంటి మత్తు పదార్థాలపై నిఘా పెట్టినట్లు వివరించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో స్కూళ్లలోనూ ఈగల్ కమిటీలు ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. బహిరంగ ప్రదేశాలు, స్కూళ్లలో గంజాయి వాడకం లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏపీలో 44 ప్రభుత్వ, ప్రైవేట్ డీ ఎడిక్షన్ సెంటర్లు ఉన్నాయని, జైళ్లలోనూ డీ ఎడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర హోంశాఖ మార్గనిర్దేశం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 1972 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఈగల్‌కు గంజాయి, డ్రగ్స్‌పై సమాచారం అందించవచ్చని చెప్పారు. స్కూళ్లలో ఈగల్ టీంల ఏర్పాటు, వర్క్ షాప్‌ల నిర్వహణ, సమన్వయ బాధ్యతలో ప్రజలు, ప్రతి ఎమ్మెల్యే భాగ స్వామ్యం కావాలని కోరారు. నేరాల నియంత్రణ తగ్గించడానికే గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు స్పష్టం చేశారు. డ్రోన్ టెక్నాలజీ, ఎడ్రిన్ శాటిలైట్, ప్రత్యామ్నాయాలతో గంజాయి సాగు అరికడుతున్నామని వివరించారు.

### గంజాయితో దొరికితే ఇకపై అంతే

కేంద్ర మంత్రిత్వ శాఖ నిదాన్ పోర్టల్‌లో ఉన్న చాలా కఠినమైన నియమ, నిబంధనలు హోంమంత్రి సభ దృష్టికి తీసుకువచ్చారు. నేషనల్ ఇంటిగ్రేటెడ్ డేటా బేస్ అండ్ అరెస్టెడ్ నార్కోటిక్స్ అఫెండర్స్ పోర్టల్‌లో ఒకసారి పేరు చేరితే పాస్‌పోర్ట్ రాకపోవడం, ఆస్తులు జప్తు ఖాయమని స్పష్టం చేశారు. ఒక్కసారి గంజాయి కేసులో దొరికితే సమాజం నుంచి మనిషిని వెలివేసినట్లు కఠిన చట్టాలు రూపొందించారన్నారు. గంజాయి ఎంత ప్రమాదకరమో రూపొందించిన చట్టాల ద్వారా ప్రతి పౌరుడు అర్థం చేసుకోవాలన్నారు. ఏపీలో గంజాయిలో పట్టుబడిన గత 25 కేసులలో 20 ఏళ్లకు పైన శిక్షను అమలు చేసి న విషయాన్ని వివరించారు. అనకాపల్లి, విజయనగరం జిల్లాలలోని కేసుల్లో ఆస్తులను సైతం జప్తు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్డీపీసీ యాక్ట్ చాప్టర్ 5(ఎ) ప్రకారం ఆస్తుల జప్తు చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి ఉత్పత్తి, తయారీ, కొనుగోలు, నిల్వ, ఎగుమతి, దిగుమతి, రవాణా, సాగు, ప్రేరేపించడం, అనుమతించడం అన్నీ నేరమేనని వెల్లడించారు. గంజాయి సాగును అరికట్టడంలో పంజాబ్, యూపీ రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలు ఆదర్శంగా ఉన్నాయని వివరిస్తూ ఇప్పటికే ఓ టీంను అధ్యయనం కోసం పంజాబ్ పంపుతున్నట్లు తెలిపారు. ఏపీ సరిహద్దు రాష్ట్రాల డీజీపీలతో విశాఖ వేదికగా సమన్వయ సదస్సును త్వరలో నిర్వహిస్తున్నట్లు హోంమంత్రి పేర్కొన్నారు.

హోంమంత్రి అనిత సమాధానానికి ముందు డ్రగ్స్ వాడకంపై గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి పలు అంశాలను శాసనసభ దృష్టికి తీసుకువచ్చారు. గంజాయి, మాదకద్రవ్యాలు, పెయిన్ కిల్లర్ల రూపంలో దొరుకుతున్న డ్రగ్స్ వాడకం గురించి మరో ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవిరెడ్డి (కడప) స్పందించారు. మెడికల్ షాపులు, కొరియర్ సర్వీసులపై నిఘాపెట్టాలని ఆమె హోంమంత్రిని కోరారు. గంజాయి సాగును కూటమి ప్రభుత్వం తగ్గించడంపై తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అభినందించారు. డ్రగ్స్ రూపం మార్చుకుని సమాజంలోకి వస్తుండడం పట్ల అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. యూపీ ప్రభుత్వం తరహాలో గంజాయి సాగు, రవాణా ను ప్రోత్సహిస్తే ఇల్లు కూలగొట్టాలని మరో ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు (గాజువాక) కోరారు. డబ్బు కోసం సమాజాన్ని పెడదారిన పెడుతున్న గంజాయి కొరియర్లపై కఠిన చట్టాలు అమలు చేయాలని సూచించారు.

# కాలువల నిర్వహణ గాలికొదిలేసిన వైసీపీ

- ఐదేళ్లలో కాలువలు, డ్రైన్లలో తట్ట మట్టి కూడా తీయలేదు.
- ఆర్థిక ఇబ్బందులున్నా రూ.380 కోట్లు విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- మే లో కాలువల మరమ్మతులు
- అసెంబ్లీలో జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి (చైతన్యరథం): గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో కాలువల నిర్వహణ గాలికొదిలేశారని, పరిపాలన విధ్వంసానికి గురైందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. సోమవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో గోదావరి డెల్టా కాలువల మరమ్మత్తుల పనుల గురించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నిమ్మల సమాధానమిచ్చారు. గత ప్రభుత్వంలో కాలువలకు నీరిచ్చినా చివరి భూములకు నీరందే పరిస్థితి ఉండేది కాదన్నారు. దీంతో దాతలు, రైతుల సహకారంతో అత్యవసర పనులు చేసుకోవాల్సిన దుస్థితి ఉండేది. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్క, తూటికాడ తొలగించేందుకు గత పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పూడిక తీతకు సంబంధించి డ్రైన్లు, కాలువలు, రిజర్వాయర్లు, చెరువుల్లో ఎక్కడా ఒక్క తట్ట మట్టి కూడా తీయలేదు. ఇంక లాకులు, గేట్లు, షట్టర్ల నిర్వహణ పనులను పూర్తిగా గాలికొదిలేశారు. కనీసం గ్రీజు పెట్టే పరిస్థితి కూడా లేదు. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు, అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయినా నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కనీసం కన్నెత్తి కూడా చూడలేదని మంత్రి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భారీ వరదలకు తుంగభద్ర డ్యాం గేట్లు కొట్టుకుపోతే, అప్పటికప్పుడు సీనియర్ ఇంజనీర్ కన్నయ్య నాయుడును తీసుకెళ్ళి, వరద ప్రవాహం ఉండగానే, దేశ చరిత్రలోనే మొదటిసారిగా స్టాప్‌లాగ్ గేట్లు ఏర్పాటు చేసి, రిజర్వాయర్‌లో నీటిని కాపాడామన్నారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఇదే తేడా అని స్పష్టం చేశారు. అదేవిధంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా అత్యవసర పనులు, మరమ్మత్తుల నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు 380 కోట్ల రూపాయల నిధులు ఇచ్చారని తెలిపారు. గత ఐదేళ్లు గోదావరి డెల్టా కాలువల నిర్వహణ సరిగా లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రస్తుత రబీ పంట పూర్తైన వెంటనే, మే నెలలో కాలువల మరమ్మత్తుల ప్రతిపాదనలు తీసుకున్నామన్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 4971 పనులకు ప్రతి పాదనలు వచ్చాయని, ఈ పనులు చేయడానికి 336.43 కోట్ల రూపాయలు నిధులు అవసరం అని అంచనా వేసినట్లు తెలిపారు. వీటిలో గోదావరి డెల్టాకు సంబంధించి 1868 పనులకు రూ.129.38 కోట్లకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ఈ పనులకు సంబంధించి అనుమతులు కోసం ఆర్థిక శాఖకు పంపించామన్నారు. గతంలో రైతులు చెల్లించే నీటి తీరువా పన్నుల నుండి వచ్చిన ఆదాయంతో ఈ పనులు చేసేవారమని, కానీ గత రెండు, మూడేళ్ళ నుండి నీటి తీరువా ఫండ్ కూడా ఏమీ లేకపోవడంతో, ఆర్థిక శాఖ సహకారంతో ఈ పనులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని సభకు తెలిపారు. ఈ ప్రతిపాదనలను మార్చి నెలలోనే ఆర్థిక శాఖకు పంపి, ఈ పనుల అవసరాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి, ఆయన సహకారంతో పనులు చేపడతామని తెలిపారు. ఈ పనుల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తే, సంబంధిత ఏజెన్సీతో పాటు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గోదావరి డెల్టాకు గుండెకాయ వంటి కాటన్ బ్యారేజి గేట్ల రిపేర్లను గత ప్రభుత్వం గాలికొదిలేయడంతో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గేట్ల మరమ్మత్తుల కోసం, డ్రిప్-2 కింద రూ.164 కోట్ల రూపాయలతో ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపించిందని వివరించారు. డెల్టాలోని ఆఖరి ఎకరం వరకు సాగు నీరు అందించేందుకు రైతుల భాగస్వామ్యంతో సాగునీటి సంఘాలను తీసుకొచ్చామని తెలిపారు.

# బాలయోగి సేవలు మరువలేనివి

**- సీఎం చంద్రబాబు నివాళి**



అమరావతి (చైతన్యరథం): లోక్‌సభ తొలి దళిత స్పీకర్, తనకు అత్యంత ఆప్తుడు గంటి మోహనచంద్ర బాలయోగి 23వ వర్ధంతి సందర్భంగా ఆయన స్మృతికి సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనంగా నివాళి అర్పించారు. అనునిత్యం పేద ప్రజలకోసం పనిచేసిన బాలయోగి జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. మరీ ముఖ్యంగా దళితులకు ఆయన చేసిన సేవలు మరువలేనివని సీఎం చంద్రబాబు కొనియాడారు.

## వ్యవసాయ ఎగుమతులను పెంచేందుకు ఏపీమార్క్‌ఫెడ్, ఎన్‌సీఈఎల్ మధ్య ఒప్పందం



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రం నుండి వ్యవసాయ ఎగుమతులను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపీమార్క్‌ఫెడ్), న్యూఢిల్లీకి చెందిన నేషనల్ కో-ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్) మధ్య వ్యూహాత్మకమైన అవగాహన ఒప్పందం జరిగింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఎక్స్-ఆఫీషియో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, వ్యవసాయం, వ్యవసాయం) బుడితి రాజశేఖర్, ఏపీమార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజు సమక్షంలో మార్క్‌ఫెడ్ ఎండీ డా. మనజీర్ జిలానీ సమూన్, ఎన్‌సీఈఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఉనుపమ్ కౌసిక్ వ్యూహాత్మక అవగాహన ఒప్పందం పై సంతకం చేశారు.

ఈ ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని సహకార సంఘాలు, రైతుల నుండి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి ఏపీమార్క్‌ఫెడ్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. జాతీయ స్థాయి ఎగుమతి ఏజెన్సీ అయిన ఎన్‌సీఈఎల్ కీలకమైన వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్, అంతర్జాతీయ మార్కెటింగ్‌ను సులభతరం చేస్తుంది. రైతుల ఆదాయాన్ని పెంచడానికి, ప్రపంచ మార్కెట్ అవకాశాలను సృష్టించడానికి, రాష్ట్రం నుండి వ్యవసాయ ఎగుమతులను బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం ఎంతగానో దోహద పడనుంది.

# ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలు

- పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నాం
- అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి(చైతన్యరథం): మహాకుంభమేళాకు ధీటుగా గోదావరి పుష్కరాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్న ముఖ్యమంత్రి సూచనలమేరకు ముందుకువెళుతున్నట్లు జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో సభ్యులు రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌లు పుష్కరాలకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు నిమ్మల సమాధానమిచ్చారు. భారతీయ సంస్కృతిలో గంగానదికి ఎంతో పురాణ ప్రాశస్త్యం ఉంది. భారతదేశంలో గంగా నది తర్వాత అంతటి గొప్ప ప్రాశస్త్యం ఉన్న నది గోదావరి. అందుకనే గోదావరిని దక్షిణ గంగ అని కూడా పిలుస్తారు. గోదావరి నదికి 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు పుష్కరాలు జరుగనున్నాయి. రెండేళ్ల వ్యవధి ఉన్నప్పటికీ ముఖ్య మంత్రి సూచన మేరకు ఇటీవలే రాజమండ్రిలో పుష్కరాల సన్నాహక సమావేశం జరిపి వివిధ అంశాలను చర్చించినట్లు చెప్పారు. 2003, 2015లో గోదావరి పుష్కరాలు నిర్వహించే భాగ్యం ముఖ్యమంత్రిగా చంద్రబాబుకే దక్కింది. పుష్కరాల నిర్వహణలో ఆయనకు అపార అనుభవం ఉంది. 2015 గోదావరి పుష్కరాల్లో 307 పనులను రూ.117 కోట్లతో చేశాం. 3625 మీటర్ల పొడవున 145 ఘాట్లను గుర్తించాం. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలో 2,452 మీటర్ల పొడవునా 98 ఘాట్లను గుర్తించాం. ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు, వాటర్ మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోలు మాత్రమే ఇరిగేషన్ శాఖ చూస్తుంది. నిర్వహణ పంచాయతీరాజ్ డిపార్ట్ మెంట్ చూస్తుంది. పుష్కరాలకు సంబంధించి ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖలే కాకుండా హోమ్, ఎండోమెంట్, పురపాలక శాఖ, ఆర్ అండ్ బీ, ఫిషరీస్, పౌరసరఫరాలు, పర్యాటక శాఖలు పాలుపంచుకుంటాయని తెలిపారు. ఈ శాఖలు తరచూ సమన్వయ సమావేశాలు జరుపుకుంటూ సమర్థంగా, ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లి గోదావరి పుష్కరాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. 1.2 కిలోమీటర్లు పొడవున్న కోటిలింగాల రేవు ఘాట్ వంటి పుష్కర పనులు శాశ్వత ప్రాతిపదికన చేయాలని రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించగా అందుకు మంత్రి అంగీకరించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి పుష్కరాలను రాజమండ్రికే పరిమితం చేయకుండా కోనసీమ ప్రాంతంలో గోదావరి పాయలు, అనేక దేవాలయాలు ఉన్నందున కోనసీమకు కూడా విస్తరిస్తే జన సంద్రాన్ని విభజించినట్లు అవుతుందని సూచించగా సానుకూలంగా స్పందించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 30 కిలోమీటర్ల గోదావరి తీరం ఉందని.. అందువల్ల పుష్కరాలకు సంబంధించి కొవ్వూరు ప్రాశస్త్యాన్ని గుర్తు చేశారు. కొవ్వూరు గోష్పాద క్షేత్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అంశాన్ని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కొవ్వూరు ప్రాంతం వైపు పుష్కర భక్తులకు, యాత్రికులకు ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా మంచినీటి సదుపాయం పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే దేవాదాయ శాఖ ద్వారా అనేక దేవాలయాలను ఆధునీకరించటం, స్వల్ప మరమ్మతులు చేయటం, రంగులు వేయడం వంటి పనులు ఇప్పటి నుంచే చేసుకుంటే బాగుంటుందని సూచించారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పుష్కర దారులన్నీ ఇప్పటి నుంచే మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రత్యేకించి తాడేపల్లి గూడెం-రాజమండ్రి (వయా నిడదవోలు) పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. సభ్యుల సూచనలను ఆయా శాఖల మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళతానని నిమ్మల తెలిపారు.

# వేసవిలోనూ రైతులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా



- గృహ, పారిశ్రామిక, వ్యాపార అవసరాలకు ఇబ్బంది లేకుండా చర్యలు
- ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి
- ఆర్డీఎస్ఎస్ పనులు వేగవంతం చేయాలి
- డిస్కంల సీఎండీలతో సమీక్షలో మంత్రి గొట్టిపాటి

అమరావతి(చైతన్యరథం): వేసవి కాలంలో అధిక వినియోగానికి తగినట్లు విద్యుత్ ఉత్పత్తి ఉండేలా అధికారులు చర్యలుతీసుకోవాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.వేసవిలో విద్యుత్ వినియోగం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై డిస్కంల సీఎండీలతో సచివాలయంలో సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్షసమావేశం నిర్వహించారు. రానున్న వేసవి కాలంలోకూడా రైతులకు 9గంటల నిరంతరాయ ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. గృహ, వ్యాపార, పారిశ్రామిక వినియోగ అవసరాలకు ఇబ్బంది లేకుండా అందరికీ 24 గంటల విద్యుత్ అందించాలని స్పష్టం చేశారు. విద్యుత్ గరిష్ఠ డిమాండ్ సుమారు 13,700 మెగావాట్లకు చేరుకోవచ్చని, ఈ వేసవి కాలంలో రోజువారీ విద్యుత్ వినియోగం 260 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని అంచనాలున్న నేపథ్యంలో... ముందస్తు ప్రణాళికలతో విద్యుత్‌సరఫరాకు ఎటువంటి ఇబ్బందులులేకుండా చూడాలని విద్యుత్ సంస్థలకు ఆయన సూచించారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగ డిమాండ్‌ను తీర్చడానికి ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని, ముఖ్యంగా సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి కోరారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం 22,709 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చిందన్నారు. డిమాండ్ మేరకు రైతులకు అవసరమైనన్ని వ్యవసాయ విద్యుత్‌కనెక్షన్లు ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. వేసవి కాలంలో ఎక్కువమంది రైతులకు ప్రయోజనం చేకూర్చేలా కనెక్షన్ల ప్రాసెసింగ్ వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి.... విద్యుత్ పంపిణీ సామర్థ్యాలను పెంచుకోవడం, నష్టాలను తగ్గించడం, సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ నెట్వర్క్‌లను ఆధునీకరించడంపై అధికారులు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. సమీక్షలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, డిస్కంమ్‌ల సిఎండిలు పృథ్వీ తేజ్, భాస్కర్, సంతోష్ రావు, నెడ్ క్యాప్ వీసీఎండీ ఎం. కమలాకర్ బాబు, ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శి కుమార్ రెడ్డి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ భూ రీ సర్వేలో తప్పులు

- పేరేచెర్ల వీఆర్వో ఇబ్బందులు
- ప్రజావినతుల్లో బాధితుడి ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన మర్రెడ్డి, గొట్టిముక్కల





మంగళగిరి(చైతన్యరథం): మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రజా వినతుల కార్యక్రమం జరిగింది. వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు అర్జీలు అందజేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గొట్టిముక్కల రఘురామ రాజు, అగ్రికల్చరల్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులకు, నాయకులకు ఫోన్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

– పేరేచెర్లకు చెందిన వీఆర్వో తనకు అన్యాయం చేస్తున్నాడంటూ షేక్ జాన్ సైదా ఫిర్యాదు చేశారు. రీ సర్వేలో భూమి తప్పుగా చూపించి అడిగితే ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయారు. తనకు న్యాయం చేయాల్సిందిగా కోరారు.

– వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆపార్టీ నాయకులు సోపర్ల హర్షారెడ్డి, సాంబారెడ్డి తదితరులు ఇబ్బంది పెట్టారని ఒంగోలు పట్టణానికి చెందిన దావులూరి ఆదెయ్య ఫిర్యాదు చేశారు. తన ఇంటి నిర్మాణ పనులకు అడ్డు తగులుతూ దాడి చేయగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఆ కేసులో ఇంతవరకు పోలీసులు చార్జిషీట్ దాఖలు చేయలేదని, తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

– వైసీపీకి చెందిన వడ్డ శీను తనను హింసిస్తున్నాడని పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన కొండాపురం మండలం గొంది గుండలపాలెం గ్రామానికి చెందిన పి.చిన్న ఫిర్యాదుచేశాడు. తన పై దాడి చేసిన శీనుపై చర్యలుతీసుకోవాలని కోరారు.

– కన్న కొడుకే కాలయముడిగా మారాడని,తనకు రక్షణ కల్పించాలని అనకాపల్లి జిల్లా రాయవరం మండలం వేమగిరి గ్రామానికి చెందిన తల్లి సరోజ ఫిర్యాదు చేశారు. రూ.15 లక్షలు అప్పు చేసి తమ కుమారుడి వివాహం చేశామని వివరించింది. తమకున్న 60సెంట్ల భూమి అమ్మి అప్పు తీర్చబోతుంటే అడ్డుకుంటూ కొనేవారిపై దాడిచేస్తున్నాడు. ఎస్ఐకు చెప్పినా ఫలితం లేదని,తమకు రక్షణకల్పించాలని కోరింది.

– ఆస్తి తగాదా విషయంలో తమ సమీప బంధువులు అకారణంగా తమపైకి దాడికి దిగుతున్నారని పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన చింతలపల్లి షణ్ముఖేశ్వరి ఫిర్యాదు చేశారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులే తమను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తమకు పోలీసుల నుంచి రక్షణ కల్పించాలని వినతిపత్రం అందజేసి వేడుకుంది.

– విదేశీ విద్య పథకం కింద రావాల్సిన మొత్తం గత వైసీపీ ప్రభుత్వం నిలిపి వేసిందని తిరుపతికి చెందిన అన్నం రేష్మా వివరించారు. దాన్ని తిరిగి ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు.

– సత్యసాయి జిల్లా చెన్నకొత్తపల్లె మండల ఎస్టీ కాలనీవాసులు తమకు ప్రత్యేకంగా రేషన్ షాపు మంజూరు చేయాలని కోరారు. రేషన్ పంపిణీ సమయాల్లో రెండు కిలో మీటర్ల దూరం వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తుందని వివరించారు. దాంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.



# ఎన్టీఆర్ వీరాభిమాని అంత్యక్రియలు





- పాడెమోసిన నందమూరి రామకృష్ణ
- పోతుగంటి సేవలు అజరామరం
- ఆయన మరణం కలచివేసిందని ఆవేదన
- భౌతికకాయాన్ని చూసి కన్నీటిపర్యంతం



కడప(చైతన్యరథం): ఎన్టీఆర్ వీరాభిమాని, నందమూరి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, కుటుంబసభ్యుడిగా మెలగిన కడపకు చెందిన టీడీపీ నాయకుడు, ఉపాధి హామీ పథకం మాజీ కౌన్సిల్ మెంబర్ పోతుగంటి పీరయ్య మృతిచెందారు. సోమవారం జరిగిన అంత్యక్రియల్లో నందమూరి రామకృష్ణ పాల్గొని పాడె మోశారు. మృతదేహాన్ని చూసి కంటతడి పెట్టుకున్నారు. ఆయనతో పాటు గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురు మూర్తి ఉన్నారు. ఈ సందర్భంగా కార్యకర్త స్థాయి నుంచి పార్టీలో రాష్ట్రస్థాయిలో గుర్తిం పు పొందిన పీరయ్యకు నందమూరి, నారా కుటుంబాలతో పాటు వ్యక్తిగతంగా తనకున్న స్నేహబంధాన్ని, ఆత్మీయతను గుర్తు చేసుకున్నారు. పీరయ్య ఆకస్మిక మరణం తమను ఎంతగానో బాధించి ందన్నారు. పార్టీ సుశిక్షితుడైన కార్యకర్తను కోల్పోయిందని, మా అందరి హృదయాల్లో పీరయ్య చెరగని ముద్రవేశారని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కా రం, పార్టీ శ్రేణులకు వెన్నుదన్నుగా నిలవడంలో పీరయ్య ఎప్పుడూ ముందుండేవారని, ఆయన సేవలు అజరామరమని కొనియాడారు. పీరయ్య తమ కుటుంబసభ్యులలో ఒకరు.. అత్యంత ఆప్తుడు..మా కుటుంబంలో వ్యక్తిని కోల్పోవడం తమకు, పార్టీకి తీరని లోట న్నారు. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా తాము ముందుంటామని, వారిని కాపాడు కోవటం మా కర్తవ్యమన్నారు. ఎన్టీఆర్ వీరాభిమానిగా, కడప జిల్లా నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడిగా, టీడీపీలో చురుగ్గా పనిశారు..పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారు..వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ఎన్నో ఇబ్బందులకు గురిచేసినా తలొగ్గక ప్రజాపక్షాన పోరాటం సాగించారని గుర్తుచేశారు. వైసీపీ దురాగతాలకు ఎదురొడ్డి రూ.3 వేల కోట్ల పెండింగ్ ఉపాధి హామీ నిధులు సాధించిన విషయాన్ని గుర్తుచేశారు.

నాడు చంద్రబాబు అరెస్టుకు నిరసిస్తూ వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ 53 రోజుల పాటు నల్లదుస్తులు ధరించి కాళ్లకు చెప్పులు లేకుండా దీక్ష చేసి చంద్రబాబుపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారని, మంగళగిరి పార్టీ కార్యాలయంపై దాడి చేసినప్పుడు వైసీపీ గూండాలపై వీరోచితంగా పోరాడిన ధీరుడని కొనియాడారు. ఎవరు కష్టాల్లో ఉన్నా వెన్నంటే ఉండేవారు..గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంలో కీలక భూమిక పోషించారు. వారి కుటుంబసభ్యులకు నందమూరి, నారా కుటుంబాలు, పార్టీ తరపున సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు లింగారెడ్డి, అమీర్ బాబు, పాలిశెట్టి హరిప్రసాద్, సింగారెడ్డి గోవర్ధన్‌రెడ్డి, యాదగిరి రాంప్రసాద్, జనసేన నాయకులు సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పీరయ్య మృతి తీరనిలోటు

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో నివాళి



మంగళగిరి(చైతన్యరథం): కడపకు చెందిన నందమూరి వీరాభిమాని, టీడీపీ నాయకుడు పోతు గంటి పీరయ్య మృతికి నివాళులర్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయనసేవలను గుర్తుచేసుకున్నారు. ముందుగా జీఎంసీ బాలయోగి, పీరయ్య చిత్రపటా లకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంత రం వక్తలు మాట్లాడుతూ అంకితభావం కలిగిన పీరయ్య వంటి కార్యకర్తల బలంతో పార్టీ చిరకాలం నిలిచి ఉంటుందని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఆయన సేవలను కొనియాడారు. పార్టీ కార్య క్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీబలోపేతం కోసం చేసిన కృషి మరువలేనిదని గుర్తుచేసుకున్నారు.టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాత్రింబవళ్లు పనిచేస్తూ పార్టీ కార్యకర్తలకు అండగానిలబడ్డారు. వైసీపీ ప్రభుత్వం లో నిలిపివేసిన బిల్లులపై కార్యకర్తల తరపున పోరా టం చేశారు.. కడప జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడిగా, పార్టీ నాయకుడిగా ఆయన చేసిన కృషి పార్టీ ఎన్నటికీ మరువలేదు. చంద్రబాబు, లోకేష్‌లు టీడీపీ కార్యకర్తల కుటుంబా లకు అండగా ఉంటారు. పీరయ్య కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గొట్టిముక్కల రఘు రామరాజు, అగ్రికల్చరల్ మిషన్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసులరెడ్డి, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# పోసానికి 10 రోజుల రిమాండ్



నరసరావుపేట (చైతన్యరథం): సినీ నటుడు పోసాని కృష్ణమురళికి నరసరావుపేట కోర్టు 10 రోజుల రిమాండ్ విధించింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆయనపై టీడీపీ నేత కిరణ్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో పోసానిని అదుపులోకి తీసుకున్న పల్నాడు పోలీసులు సోమవారం సాయంత్రం నరసరావుపేట కోర్టులో హాజరుపరిచారు.

విచారణ చేపట్టిన న్యాయస్థానం అతడికి మార్చి 13 వరకు రిమాండ్ విధించడంతో గుంటూరు జైలుకు తరలించారు.

రాష్ట్రవ్యాప్తంగా పోసాని కృష్ణమురళిపై 17 కేసులు నమోదయ్యాయి. ఇటీవల అరెస్టయి ప్రస్తుతం రాజంపేట జైలులో ఉన్న పోసానిని అక్కడి ఉన్నతాధికారుల అనుమతితో పల్నాడు జిల్లా నరసరావుపేట పోలీసులకు అప్పగించారు. క్రైమ్ నెంబర్ 142/2024 కింద పోసానిపై నరసరావుపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 153, 504, 67 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నరసరావుపేట పోలీసులకు అప్పగించే ముందు పోసానికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

జోన్ - 1
(శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)
చైతన్యరథం

# రుషికొండ బీచ్‌కు ఆ హెూదా రద్దు చేయలేదు



విశాఖలోని రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ రద్దు చేయబడిందని చెప్పడం తప్పనీ, ఇది కేవలం తాత్కాలికంగా నిలిపివేసినట్లు ప్రభుత్వ వర్గాలు వివరణ ఇచ్చాయి. ప్రధానంగా రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ సమస్యల కారణంగా తాత్కాలికంగా ఉపసంహరించుకున్నారనీ, మార్చి 4, 2025న జరగనున్న భద్రతా ఆడిట్ (%ూాూ%) అనంతరం బ్లూ ఫ్లాగ్ తిరిగి మంజూరు కానుందనీ వివరించారు.

రుషికొండ బీచ్ ప్రత్యేకత అధిక సందర్శకుల రద్దీ

ఇతర బ్లూ ఫ్లాగ్ బీచ్‌లతో పోలిస్తే రుషికొండ బీచ్‌కు అధిక సందర్శకుల ప్రవాహం ఉంటుంది. ఆర్కే బీచ్‌తో పోలిస్తే రుషికొండ బీచ్ ప్రశాంతమైన సముద్ర తీరంగా ఉండటంతో ఎక్కువ మంది యాత్రికులు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ప్రతి నెల సీజన్లో 70,000 1,00,000 మంది సందర్శకులు ఇక్కడికి వస్తున్నారు. వారాంతాల్లో, పండగల సమయంలో పర్యాటకుల సంఖ్య మరింతగా పెరుగుతుంది.

**జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం:**

ఫిబ్రవరి 17, 2025న జిల్లా కలెక్టర్, రుషికొండ బీచ్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నేతృత్వంలో సమీక్షా సమావేశం జరిగింది. జీవీఎంసీ ఫారెస్ట్, అగ్నిమాపక, పోలీస్, ఫిషరీస్, వంటి శాఖల అధికారులకు రుషికొండ బీచ్ ప్రతిష్ఠకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ప్రస్తుతం చేపడుతున్న చర్యలు**

కొత్త పార్కింగ్ వసతి నిర్మాణం (70% పని పూర్తి)

జీఎంసీ వ్యర్థాల నిర్వహణ, హరిత పర్యావరణ అభివృద్ధి

పోలీస్ శాఖ అదనపు సిబ్బందిని నియమించి జనసందోహాన్ని నియంత్రిస్తోంది

ఏపీటీడీసీ అదనపు మరుగుదొడ్ల నిర్మాణం, వాకింగ్ పథుల మరమ్మతులు చేపడుతోంది

బీచ్ నిర్వహణ కోసం ప్రత్యేక ఆపరేటర్‌ను నియమించేందుకు ఏపీటీడీసీ చర్యలు తీసుకుంటోంది

బ్లూ ఫ్లాగ్ నేషనల్ ఆపరేటర్ సూచించిన సిఫార్సులను త్వరలోనే పూర్తి చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మార్చి 2025లో రుషికొండ బీచ్ తిరిగి బ్లూ ఫ్లాగ్‌ను ఎగురవేయనుందనీ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ ఘనత:

విశాఖపట్నంలోని రుషికొండ బీచ్ మరోసారి బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందడం రాష్ట్రానికి గర్వకారణం. భారతదేశంలోని 12 బ్లూ ఫ్లాగ్ బీచ్‌లలో ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఘనత సాధించిన ఏకైక బీచ్ రుషికొండ. 2020లో మొదటిసారిగా బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్ 2024-25 సంవత్సరానికిగాను అక్టోబర్ 2024లో మరోసారి ఈ అంతర్జాతీయ గుర్తింపును పొందింది.

**బ్లూ ఫ్లాగ్ గుర్తింపు**

బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ అనేది అంతర్జాతీయ పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న బీచ్‌లకు ఇచ్చే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గుర్తింపు. దీన్ని డెన్మార్క్‌లోని ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ ద్వారా అందజేస్తారు. ఈ గుర్తింపు పొందడానికి బీచ్ పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత, నీటి నాణ్యత, సురక్షితమైన స్థిరమైన పర్యాటక విధానాలు, వ్యర్థ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ చర్యల వంటి కఠినమైన ప్రమాణాలను పాటించాలి.

# కురుపాంలో ఏనుగుల బీభత్సం



ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఏనుగులు ధ్వంసం చేసిన పార్వతీపురం మన్యం జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కురుపాం మండలంలోని సీతంపేట, గోళ్లవలస గ్రామాల్లోని పంట పొలాల్లో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఎంతో కష్టపడి రైతులు పండిస్తున్న పుచ్చ తోటను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. దీంతో చేతికి వచ్చిన పంటను ఏనుగులు నాశనం చేయడంతో నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. ఇలా ఏడాదికి మూడు, నాలుగు సార్లు ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని అన్నారు. అప్పులు తెచ్చి మరీ పెట్టుబడులు పెట్టిన పంటలు కళ్లముందే నాశనం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రుణాలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అధికారులు ఏనుగులు తరలిస్తే తప్ప ఈ ప్రాంతంలో వ్యవసాయం చేసే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఏనుగుల గుంపు ధ్వంసంలో నష్టపోయిన పంట వివరాలను తెలిపేందుకు రైతులు కురుపాం అటవీ రేంజ్ కార్యాలయంకి వెళ్లారు. ఏ ఒక్క అధికారి అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

# ఒక్కరోజులోనే... 100 కేసులు



మోటారు వాహన చట్టంలో కొత్త నిబంధనలను పోలీసులు పక్కాగా అమలు చేస్తున్నారు. శనివారం నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రాగా.. తొలిరోజు వాహనదారులకు పూలు ఇచ్చి.. అవగాహన కల్పించారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ తనిఖీలు చేశారు. శ్రీకాకుళంలో ఆది వారం ఒక్కరోజే 100 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. అందులో హెల్మెట్ ధరించని 18 మందికి రూ.వెయ్యి చొప్పున అపరాధ రుసుం విధించారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిందేనని ట్రాఫిక్ సీఐ నాగ రాజు అన్నారు. ఏడురోడ్ల కూడలిలో నూతన మోటారు వాహన చట్టాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

# టెన్త్ పాసైయ్యారా? రాత పరీక్ష లేకుండానే 21,413 తపాలా ఉద్యోగాలు




కేవలం పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎలాంటి నియామక పరీక్ష లేకుండా తెలుగు రాష్ట్రాల్లో భారీగా తపాలా ఉద్యోగాలకు ప్రకటన జారీ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో 1215, తెలంగాణలో 519 చొప్పున ఉద్యోగాలు ఉన్నాయి. పదో తరగతి మార్కుల ఆధారంగా బీపీఎం, ఏబీపీఎం, డాక్ సేవక్‌లుగా ఎంపిక చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి మరికొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్నాయి.. ఎలాంటి నియామక పరీక్ష లేకుండా కేవలం పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ పోస్టల్ సర్కిళ్లలో భారీగా ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ఈ మేరకు తపాలా శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్-2025) ప్రకటన విడుదలైంది. దేశ వ్యాప్తంగా మొత్తం 21,413 గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగాలను ఈ నోటిఫికేషన్ కింద భర్తీ చేయనున్నారు. ఇక తెలుగు రాష్ట్రాల్లోనూ భారీగా ఖాళీలు ఉన్నాయి. పదో తరగతి మార్కుల ఆధారంగా బీపీఎం, ఏబీపీఎం, డాక్ సేవక్‌లుగా ఎంపిక చేయనున్నారు. అలాగే మార్చి 3, 2025 నాటికి 18 నుంచి 40 ఏళ్ల వయసు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయసు సడలింపు వర్తిస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు, దివ్యాంగులకు, ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులు ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్ అభ్యర్థులు రూ.100 చెల్లించాలి. గణితం, ఆంగ్లం, స్థానిక భాషల్లో తప్పని సరిగా నైపుణ్యం ఉండాలి. ఆయా పోస్టులను బట్టి సుమారు రూ.10 నుంచి రూ.29 వేల వరకు జీతం పొందవచ్చు. తపాలా శాఖలో ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే వారు మార్చి 3వ తేదీ రాత్రి 11 గంటల 59 నిమిషాల వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ రోజు తుది గడువులోగా ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగపరచుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఫోన్ నంబర్, మెయిల్ ఐడీ, వ్యక్తిగత వివరాలతో ముందుగా రిజిస్టర్ చేసుకోవాలి. పదో తరగతి మార్కులు, ఆధార్‌కార్డు, ఫొటోలు, అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు పూర్తిచేసిన అనంతరం జిల్లాలో ఉన్న ఖాళీల ప్రకారం ప్రాధాన్యత ఇస్తే మీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుంది. మార్చి 6, 2025 నుంచి మార్చి 8, 2025 వరకు దరఖాస్తు సవరణలకు అవకాశం ఉంటుంది. ఎలాంటి రాత పరీక్ష లేకుండానే.. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఈ నియామకాలు చేపడతారు. ఈపోస్టులకు ఎంపికైనవారు బ్రాంచ్‌పోస్టు మాస్టర్ (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ (ఏబీపీఎం), డాక్ సేవక్ హెూదాలతో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. మొత్తం ఖాళీల్లో ఆంధ్రప్రదేశ్‌లో 1215, తెలంగాణలో 519 చొప్పున ఉద్యోగాలు ఉన్నాయి. ఈ పోస్టులకు ఎంపికైనవారు రోజుకు నాలుగు గంటలు పనిచేస్తే సరిపోతుంది. వీటితోపాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకుకు సంబంధించిన సేవలకు గానూ ప్రత్యేకంగా ఇన్సెంటివ్ రూపంలో బీపీఎం/ ఏబీపీఎం/ డాక్ సేవక్‌లకు ప్రోత్సాహం అందిస్తారు. ఎంపికైన వారిని ఖాళీగా ఉన్న బ్రాంచీలు, హెూదా ఆధారంగా ఉద్యోగానికి ఎంపిక చేస్తారు.




# శ్రీకాకుళంలో ఎండిపోతున్న పంటలు



రబీసీజన్‌లో వరిపంట చేతికి వచ్చే సమయంలో రైతులకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. సక్రమంగా సాగునీరు అందక పంట పొలాలు బీటలు వారుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడో కాలువలు, చెరువుల్లో ఉన్న నీటిని మోటారు ఇంజన్ల ద్వారా పంటకు అందించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో వంశధార కాలువ దిగువన నరసన్నపేట, జలుమూరు, సారవకోట మండలాల్లో సుమారు 3 వేలు ఎకరాల్లో వరి సాగు చేశారు. రెడ్డికపేట, గొట్టిపల్లి, కరగాం, నర్సింగపల్లి, జమ్ము, కంబకాయి, టెక్కలిపాడు, బసివాడ, గుగ్గిలి, వెలుసాద, తాళ్లవలస, పాగోడు, జలుమూరు, ఐద్రి, గోపాలపురం తదితర గ్రామాల్లో రైతులు అధికంగా వరి పండిస్తున్నారు. గతేడాది మాదిరి సాగునీరు వస్తుందని ఆశించి.. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. కాగా.. వంశధార కాలువల ద్వారా సాగునీరు రాలేదు. దీంతో చివరి దశలో వరి పంట ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి రెండేసి నీటి ఇంజన్లు ఏర్పాటు చేసి నీరు కడుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత కూడా పెరగడంతో నీటితడులు చాలడం లేదని వాపోతున్నారు. ఎకరాకు రూ.20వేల వరకూ పెట్టుబడి పెట్టామని, పంట దక్కే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన చెందుతున్నారు. వేరుశనగ సాగు చేసిన రైతులదీ అదే పరిస్థితి. పోలాకి, నరసన్నపేట, జలుమూరు మండలాల్లోని చీడివలస, చెల్లాయివలస, జిల్లేడివలస, జమ్ము, తామరాపల్లి, టెక్కలిపాడు తదితర గ్రామాల్లో రైతులు ఈ ఏడాది వందలాది ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. ప్రస్తుతం పంట చివరి దశకు చేరుకుంది. కాగా.. నీటి తడి ఉంటే కానీ వేరుశనగ పంట తీసేందుకు వీలుపడదు. దీంతో రైతులు సుదూర ప్రాంతాల్లోని కాలువలు, చెరువుల్లో ఉన్న నీటిని రెండు, మూడు మోటారు ఇంజన్ల సహాయంతో తోడి.. పంటకు అందిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎస్సీసీ కాలువ, మెయిన్ కాలువ ద్వారా ఈ నెలాఖరు వరకైనా నీటిని అందించాలని రైతులు కోరుతున్నారు. వంశధార నదిలో నీటిని ఎడమ కాలువ ద్వారా విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా.. గొట్టాబ్యారేజీలో నీటినిల్వలు లేకపోవడంతో కాలువల్లో నీరు విడిచిపెట్టడం లేదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

# మహా కుంభమేళాకు ధీటుగా గోదావరి పుష్కరాలు

- ఇప్పటి నుంచే పక్కా ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలి
- 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలు
- అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి /పాలకొల్లు (చైతన్యరథం): "పంచభూతాలలో ఒకటైన జలాన్ని కూడా దైవ స్వరూపంగా భావించే సంస్కృతి, ఆచారం మనది. అలాంటి జల ప్రవాహాలకు నెలవైన పుణ్య నదులలో పుష్కర స్నానమాచరించడం పరమ పవిత్రమని మన పురాణాలు చెబుతున్నాయి." అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. మహా కుంభమేళాకు ధీటుగా గోదావరి పుష్కరాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంకల్పించారని, అందులో భాగంగానే ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో అన్ని శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని కోరారు. 12 రోజులు పాటు జరిగే పుష్కరాల్లో స్నానం ఆచరిస్తే 12 సంవత్సరాలు పాటు 12 నదుల్లో స్నానం చేసిన పుణ్యఫలం దక్కుతుందనేది నమ్మకం ఉందని, భారతీయ సంస్కృతిలో గంగానదికి ఎంతో పురాణ ప్రాశస్త్యం ఉందన్నారు. భారతదేశంలో గంగా నది తర్వాత అంతటి గొప్ప ప్రాశస్త్యం ఉన్న నది గోదావరి అని, అందుకనే గోదావరిని దక్షిణ గంగ అని కూడా పిలుస్తారని అన్నారు. గోదావరి నదికి 2027 జూలై 23 నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు పుష్కరాలు జరగనున్నాయని, రెండేళ్ల వ్యవధి ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి సూచన మేరకు ఇటీవలనే రాజమండ్రిలో పుష్కరాల సన్నాహక సమావేశం జరిపి వివిధ అంశాలను చర్చించామన్నారు. 2003, 2015లోనూ గోదావరి పుష్కరాలు నిర్వహించే భాగ్యం ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. దేశ స్థాయిలో ఇటీవల జరిగిన ప్రయాగరాజ్ మహా కుంభమేళ అనుభవ పాఠాలు, సమర్ధ నిర్వహణ మనకు ఆలంబన కానున్నాయని నిమ్మల రామానాయుడు తెలిపారు.

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ... గోదావరి పుష్కరాలను రాజమండ్రికే పరిమితం చేయకుండా కోనసీమ ప్రాంతంలో గోదావరి పాయలు, అనేక దేవాలయాలు ఉన్నందున కోనసీమకు కూడా విస్తరిస్తే జనసంద్రాన్ని విభజించినట్లు అవుతుందని చేసిన సూచనకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... 30 కిలోమీటర్ల గోదావరి తీరం ఉందని.. అందువల్ల పుష్కరాలకు సంబంధించి కొవ్వూరు ప్రాశస్త్యాన్ని గుర్తు చేశారు. కొవ్వూరు గోష్పాద క్షేత్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అంశాన్ని ఆయన నొక్కి చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కొవ్వూరు ప్రాంతం వైపు పుష్కర భక్తులకు, యాత్రికులకు ఆర్డబ్ల్యూఎస్ ద్వారా మంచినీటి సదుపాయం పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే దేవాదాయ శాఖ ద్వారా అనేక దేవాలయాలను ఆధునికరించటం, స్వల్ప మరమ్మతులు చేయటం, రంగులు వేయడం వంటి పనులు ఇప్పటి నుంచే చేసుకుంటే బాగుంటుందని సూచించారు.

తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ... పుష్కర దారులన్నీ ఇప్పటి నుంచే మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రత్యేకించి తాడేపల్లిగూడెం-రాజమండ్రి (వయా నిడదవోలు) పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. సభ్యుల సూచనలను ఆయా శాఖల మంత్రుల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్తానని సభాముఖంగా నిమ్మల హామీ ఇచ్చారు.

# కొమిరేపల్లి ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి లైన్ క్లియర్

ఏలూరు (చైతన్యరథం): ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న కొమిరేపల్లి గ్రామస్థుల కల నెరవేరింది. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ కృషితో కొమిరేపల్లి వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది. మండలంలోని గుండగొలను సమీపంలోని కొమిరేపల్లి వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక 16వ నెంబరు జాతీయ రహదారి పరిధిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో అక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఎంపీకి సమస్యను విన్నవించగా ఆయన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, జాతీయ రహదారుల ఆథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంతోష్‌కుమార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వారు సానుకూలంగా స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేశారు. ఎంపీ మహేశ్ కుమార్ యాదవ్ తన క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ వెట్రిసెల్వితో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కొమిరేపల్లి అడ్డరోడ్డు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం రూ.4.50 కోట్లను మంజూరు చేసిందని, టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో నిర్మాణ పనులు చేపట్టి ఆరునెలల వ్యవధిలో అందుబాటులోకి తీసు కొస్తామన్నారు. సమావేశంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు

# కాకినాడలో పేలుడు కలకలం... హైదరాబాద్ నుంచి వచ్చిన పార్సిల్ దింపుతుండగా ఘటన



కాకినాడ (చైతన్యరథం): కాకినాడలోని పేలుడు కలకలం చెలరేగింది. బాలాజీ ఎక్స్‌పోర్ట్స్‌లో సోమవారం ఉదయం ఈ బ్లాస్ట్ జరిగింది. స్థానిక వార్పు రోడ్డులోని జై బాలాజీ ఎక్స్‌పోర్ట్స్‌లో పార్సిల్ దింపుతుండగా పెద్ద బ్లాస్ట్ జరిగింది. పేలుడు ధాటికి భారీ శబ్దం రావడంతో కార్మికులు అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. గాయపడిన వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉదయం బాలాజీ ట్రాన్స్‌పోర్టు కంపెనీలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి వచ్చిన పార్శిల్ లోడ్‌ను పలువురు కూలీలు ఆటోలో నుంచి కిందకు దించుతున్నారు. ఈ క్రమంలో ఓ కార్మికుడు పెద్ద పార్శిల్‌ను లారీ నుంచి తీసి భుజాన వేసుకుని కిందకు దించుతుండగా ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఏం జరిగిందో తెలుసుకునే లోపే పలువురు కూలీలు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పార్శిల్ దించుతున్న కూలీకి మాత్రం కాళ్లు, చేతులు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందజేస్తున్నారు. విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. హైదరాబాద్ నుంచి పార్శిల్ వచ్చినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే పార్శిల్‌ను దించిన వెంటనే పేలుడు సంభవించడానికి కారణం ఏంటి అనేదానిపై ఆరా తీయగా... అందులో చిన్న పిల్లలు కాల్చే టపాసులు ఉన్నట్లు గుర్తించారు. చిన్న పిల్లలు గోడకేసి కొట్టగా పేలే టపాసులు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. నిబంధనల ప్రకారం పేలుడు పదార్థాలు ఉన్న పార్శిల్‌ను అనుమతించడం నేరం. అయినప్పటికీ కూడా ఇలాంటి నిబంధనలు పట్టించుకోకుండా ట్రాన్స్‌పోర్టు కంపెనీలు ఏ విధంగా హైదరాబాద్ నుంచి ఇక్కడకు తరలించారు అనేదానిపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అలాగే హైదరాబాద్ నుంచి ఈ పార్శిల్‌ను ఎవరు పంపించారు.. ఆ కంపెనీ ఏంటి అనే దానిపై కూడా పూర్తిగా ఆరా తీస్తున్నారు. అయితే వేసవి నేపథ్యంలో ఇలాంటి పార్శిల్‌లు వేస్తే కచ్చితంగా ప్రమాదాలు సంభవిస్తాయని, ట్రాన్స్‌పోర్టు కంపెనీలు అజాగ్రత్తగా ప్రవర్తించడం ఏమాత్రం మంచి పద్ధతి కాదని పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# దేశమంతా చూసేలా గోదావరి పుష్కరాలు నిర్వహించాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): మహా కుంభమేళా తరహాలో దేశమంతా మనవైపు చూసేలా గోదావరి పుష్కరాలు విజయవంతంగా నిర్వహించాలని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో సభాధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మాట్లాడే అవకాశం ఇవ్వడంతో పుష్కరాల అభివృద్ధి పనులు గురించి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడారు. గోదావరి పుష్కరాలకు ఇంకా రెండేళ్ళు సమయం ఉందని, తన నియోజకవర్గంతో పాటు రాజమండ్రి రూరల్, రాజానగరం, కొవ్వూరు ఇంకా గోదావరి పరివాహక ప్రాంత పరిధిలో 12 రోజుల పాటు జరిగే పుష్కరాలకు దేశవ్యాప్తంగా 15 కోట్ల మంది యాత్రికులు, భక్తులు వస్తారని అంచనా ఉందని చెప్పారు. అయితే ఆరేడు నెలల ముందు పనులు చేపట్టడం కాకుండా వేసవిలో నది ప్రవాహం తక్కువ ఉంటుంది కనుక శాశ్వత కట్టడాలు, అభివృద్ధి పనులు ఇప్పటి నుంచే చేపడితే బాగుంటుందని సూచించారు. మనకు రెండు వేసవి కాలాల సమయం ఉందని, దీనిని సద్వినియోగం చేసుకుంటూ శాశ్వత కట్టడాలు నిర్మించే యోచన చేయాలన్నారు. ప్రణాళికాబద్ధంగా శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విజ్ఞప్తి చేశారు. తన నియోజకవర్గ పరిధిలోని కోటిలింగాల ఘాటును 2015 పుష్కరాలకు 1.2 కి.మీ. పొడవునా రికార్డు స్థాయిలో అభివృద్ధి చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఆ ఘాటులో ఇప్పుడు కూడా లక్షలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఉపయోగకరం ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సభకు తెలిపారు. మహాకుంభమేళాకు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, మంత్రి నారా లోకేష్ తదితరులు వెళ్ళి పుణ్య స్నానాలు ఆచరించిన అంశాన్ని ప్రస్తావిస్తూ కుంభమేళాకు అన్ని కోట్లమంది భక్తులు వచ్చినా ఏర్పాట్లు బాగా చేశారని మీరు, మంత్రి లోకేష్ చెప్పారని గుర్తు చేశారు. ఇక్కడ నుండి ప్రభుత్వ అధికారుల టీం కూడా వెళ్ళి ఏర్పాట్లు పరిశీలించి వచ్చిందని చెప్పారు. కుంభమేళాకు ఉపయోగించిన సాంకేతికతను, ఇతర అవకాశాలను గోదావరి పుష్కరాలకు కూడా ఉపయోగించుకుని విజయవంతంగా చేయడానికి ప్రణాళికాబద్ధంగా ఇప్పటి నుంచే ప్రభుత్వం శాశ్వత అభివృద్ధి పనులు చేపడితే బాగుంటుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. అంతకు ముందు పుష్కరాలపై మంత్రి నిమ్మల రామానాయుడు ఇచ్చిన సమాధానానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులను సైతం చంద్రబాబు ప్రభుత్వమే తీరుస్తోందని చెప్పారు. ఈ మేరకు జగన్ సర్కార్ చేసిన రూ.43 వేల కోట్ల అప్పులను తమ ప్రభుత్వమే చెల్లించినట్లు వెల్లడించారు. వైసీపీ హయాంలో ఏపీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, కోట్ల రూపాయలు ఖర్చు చేసి 20 వేల కిలోమీటర్ల రహదారులను బాగు చేసినట్లు ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఏపీ బడ్జెట్(2025-26) తొలిసారిగా రూ.3 లక్షల మార్కు దాటిందని, ఆ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని చెప్పుకొచ్చారు. ఈసారి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రతి రంగానికీ తగిన ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలు సహా ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమానికీ గత ప్రభుత్వం కంటే అధికంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఏపీ అభివృద్ధికి ఎన్డీయే సర్కార్ కట్టుబడి ఉందని, ఈ మేరకే రూ.6 లక్షల కోట్ల పెట్టుబడితో ఎంవోయులు కుదుర్చుకున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళీపై ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి కీలక వ్యాఖ్యలు చేశారు. పోసాని ఓ మూర్ఖశిఖామణి అంటూ కామెంట్ చేశారు. ఎదుటివారి కుటుంబసభ్యులు, ఆడబిడ్డల గురించి మాట్లాడేటప్పుడు ఆలోచించుకోవాలని, లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పోసాని లాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఉద్ఘాటించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయని, కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయమంటూ ధీమా వ్యక్తం చేశారు. పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు కొత్త కార్యవర్గం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు.

# బెజవాడ అంగట్లో పసిబిడ్డల విక్రయం

అప్పుడే పుట్టిన పసిబిడ్డను కొందరు దుండగులు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి పసిపిల్లలను తీసుకువచ్చి రాష్ట్రంలో సంతానం లేనివారికి గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న మహిళల ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. విక్రయిందుకు తీసుకువచ్చిన ముగ్గురు పిల్లలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మగపిల్లలు, ఒక పాపను తమ సంరక్షణలోకి తీసుకున్నట్లు విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

## గంజాయి మహమ్మారిని కూకటి వేళ్ళతో సహా పెకిలించాలి

**●హోంమంత్రి అనితను కోరిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): గంజాయి మహమ్మారిని కూకటి వేళ్ళతో సహా పెకిలించాలని, శివారు ప్రాంతాల్లో పెట్రోలింగ్, చెక్ పోస్టులు మరియు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీలో మాదక ద్రవ్యాల కట్టడి గురించి అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి... ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపటం జరిగిందని, అయినా కూడా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో చిన్నచిన్న దుకాణాల్లో మైనర్లకు కూడా గంజాయిని విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించాల్సిన గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్, గంజాయిని ప్రోత్సహించి యువత శక్తిని నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రస్తుతం గంజాయి అమ్మకాలు తగ్గినప్పటికి ఇంకా గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు సాగిస్తున్నారని, దీనిపై దృష్టిసారించి చర్యలు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి వ్యాఖ్యలపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. వైసీపీ హయాంలో 11వేల ఎకరాల్లో సాగులో ఉన్న గంజాయిని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉక్కుపాదం మోపడం జరిగిందని, దీంతో గంజాయి అమ్మకాలు గణనీయంగా తగ్గాయని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సైతం ఈగల్ టీంను ఏర్పాటు చేసి గంజాయిపై చర్యలు తీసుకున్నారని అన్నారు. గంజాయిని సమూలంగా రూపుమాపేందుకు, అలాగే మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే అనేక కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరిన విధంగా త్వరలోనే సమస్యాత్మక ప్రదేశాల్లో ప్రత్యేక నిఘాతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు.

## తాడేపల్లిలో పునుగుపిల్లి ప్రత్యక్షం

గుంటూరు జిల్లా తాడేపల్లి కొండలో నల్లగా ఒంటిపై మచ్చలతో ఉన్న నాలుగు కాళ్ల జంతువు చెంగు చెంగు మంటూ ఎగురుతూ కనిపించింది. అది ఒక్కసారిగా ఇంట్లోకి దూరడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. మొదట ఆ జంతువు ఏంటో అన్న కంగారులో దూరంగా పారిపోయారు. అదే సమయంలో జనసమ్మర్ధం పెరిగిపోవడంతో ఆ జంతువు కూడా వారిని చూసి ఇళ్లలోకి వెళ్లి దాక్కోవడం మొదలు పెట్టింది. అయితే అర గంట గడిచిన తర్వాత స్థానిక యువకులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఒక ఇంట్లో మెట్ల కిందకి దూరిన పునుగు పిల్లా పారిపోకుండా యువకులు అట్ట పెట్టెలు, బుట్టలు అడ్డుపెట్టారు. కొద్ది సేపటి తర్వాత ఫారెస్ట్ అధికారులు వచ్చి పునుగు పిల్లిని పట్టుకుని మంగళగిరి వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. పునుగు పిల్లి అంతరించి పోతున్న జీవుల్లో ఉందని ఇప్పుడు తాడేపల్లి కొండ ప్రాంతంలో కనపించడం ఆశ్చర్యంగా ఉందని ఫారెస్ట్ అధికారులు అంటున్నారు. ఒక్క పునుగు పిల్లే ఉండటం సాధ్యం కాదని మరికొన్ని ఉండే అవకాశం ఉందని అంటున్నారు. సాధారణంగా శేషచల అడవుల్లో పునుగు పిల్లులు ఎక్కువుగా ఉంటాయి. వీటి తైలంతోనే తిరుమల వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజ చేస్తారు. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం వీటిని సంరక్షించి శేషాచల అడవుల్లో వీటి సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటుంది. అటువంటి అరుదైన పునుగుపిల్లి ఏపీ రాజధాని అమరావతి ప్రాంతంలో కనిపించడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో మరిన్ని ఈ అరుదైన జంతువుల జాడ కోసం ఫారెస్ట్ అధికారులు గాలింపు చేపట్టారు.



## గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్‌కు షాక్

గుంటూరు (చైతన్యరథం): అధికారం అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం మారడంతో వారు చేసిన మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే గత సర్కార్‌లో నిబంధనల్ని పట్టించుకోకుండా గుంటూరులోని గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టిన ఆ పార్టీ నేత అంబటి మురళీకృష్ణకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే గుంటూరు నగరపాలక సంస్థ స్టాప్ ఆర్డర్ ధిక్కరించి ఓ ఫ్లాట్ పనులు పూర్తిచేసి గృహ ప్రవేశం చేయించడం వివాదాస్పదమైంది. దీనిపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదిక పంపారు.



## నూతన పరిశ్రమలు తీసుకువచ్చేందుకు ఎంపి కేశినేని కృషి

**●ఎంపి కేశినేని శివనాథ్‌ను కలిసిన ఆటోనగర్ ఇండస్ట్రీయలిస్ట్స్**

**●ఆటోమొబైల్ ఇండస్ట్రీ అభివృద్ధిపై చర్చలు**



విజయవాడ (చైతన్యరథం): ఆటోమొబైల్ రంగంలో నూతన పరిశ్రమలకు స్థాపించటానికి కావాల్సిన సదుపాయాలు, ప్రభుత్వం అందించాల్సిన సహాయ సహకారాలు, కొనసాగుతున్న పరిశ్రమలకు అందించాల్సిన చేయూత గురించి ఆటోమొబైల్ ఇండస్ట్రీ పారిశ్రామికవేత్తలు ఎంపీ కేశినేని శివనాథ్‌తో చర్చించారు. ఏపీ.ఎం.ఎస్.ఎం.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని ఆటోమొబైల్ పారిశ్రామికవేత్తలతో పాటు ఇతర పారిశ్రామికవేత్తలు సోమవారం ఎంపి కేశినేని శివనాథ్‌ను కలిసి ఆటోమొబైల్ ఇండస్ట్రీలో పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు కేశినేని దృష్టికి తీసుకొచ్చారు. ఆటోమొబైల్ ఇండస్ట్రీలో ఎంప్లాయిమెంట్ పెంచేందుకు విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన సంస్కరణలు గురించి ఎఫ్టానిక్స్ సీఈవో రామకృష్ణ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశం అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్‌కి ఆటోమొబైల్ ఇండస్ట్రీ పారిశ్రామికవేత్తలు మెమెంటో బహుకరించారు. అనంతరం కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ఆటోనగర్‌లో ఆటోమొబైల్ ఇండస్ట్రీని అభివృద్ధి చేసేందుకు నూతన పరిశ్రమలు తీసుకురావటానికి ప్రయత్నిస్తున్నట్లు తెలియజేశారు. నూతన పరిశ్రమలను స్థాపించాలనుకునే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి సదుపాయాలు, ప్రభుత్వం నుంచి కోరుతున్న సహకారం గురించి ముఖ్యమంత్రితో పాటు విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లటంతో పాటు స్వయంగా తీసుకువెళతానని మాట ఇచ్చారు. ఆటోనగర్‌లోని జీవో నెంబర్ 5,6 వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులు పారిశ్రామికవేత్తలు ఎంపీ కేశినేని శివనాథ్ దగ్గర ప్రస్తావించగా, సెక్రటరీలో రాష్ట్ర పరిశ్రమలశాఖ సెక్రటరీను కలిసే ఏర్పాట్లు ఎంపీ కేశినేని శివనాథ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.ఎమ్.ఎస్.ఎమ్.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రెసిండెంట్ బాయన వెంకటరావు, ప్రెసిడెంట్ దోనేపూడి దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ ఎమ్.రామచంద్రరావు, జె.ఆర్.డి టాటా ఇండస్ట్రీస్ ఎస్టేట్ సోసైటీ చైర్మన్ వినోద్‌బాబు, విజయవాడ ఇండస్ట్రీయల్ ఎస్టేట్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ సెక్రటరీ టి.నాగేశ్వరరావు, పారిశ్రామికవేత్తలు జి.సాంబశివరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోసాని కృష్ణమురళిపై రాష్ట్రవ్యాప్తంగా 17 కేసులు



సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళిపై ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 17 కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీసు స్టేషన్లకు సంబంధించిన పోలీసులు పీటీ వారెంట్లు సిద్ధం చేస్తూ, పోసానిని అదుపులోకి తీసుకునేందుకు పోటీ పడుతున్నారు. తాజాగా 3 జిల్లాలకు చెందిన పోలీసులు పోసానిని అదుపులోకి తీసుకునేందుకు వచ్చారు. రాజంపేట జైలు అధికారులకు పీటీ వారెంట్లు ఇచ్చారు. గుంటూరు జిల్లా నరసరావుపేట, అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతపురం గ్రామీణ పోలీసులు రాజంపేట జైలు అధికారులకు పీటీ వారెంట్లు అందించారు. 'మేం కోర్టు అనుమతి తీసుకున్నాం, ముందుగా మాకే పోసాని కృష్ణమురళిని అప్పగించాలి' అంటూ నరసరావుపేట పోలీసులు జైలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పోసానికి తీసుకెళ్లేందుకు వారు వాహనాలు సైతం సిద్ధం చేసుకుని ఉదయమే రాజంపేట సబ్ జైలు వద్దకు చేరుకున్నారు. ఒకేసారి 3 స్టేషన్ల పోలీసులు పీటీ వారెంట్లు తీసుకురావడంతో పోసానిని ముందుగా ఎవరికి అప్పగించాలనే విషయంపై జైలు అధికారులు ఉన్నతాధికారులతో సమాలోచనలు చేశారు. ఇందుకు సంబంధించిన నిబంధనలు పరిశీలించిన అనంతరం పోసానిని పల్నాడు జిల్లా నరసరావుపేట పోలీసులకు అప్పగించారు. బీఎన్ఎస్ యాక్ట్ సెక్షన్ 153, 504, 67ల కింద నరసరావుపేటలో పోసానిపై గతంలో కేసు నమోదైంది. పోసానిని అప్పగించడానికి ముందు రాజంపేట సబ్ జైలు అధికారులు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె నొప్పి ఉందని చెప్పడంతో వైద్యులను పిలిపించి పరీక్షలు చేయించారు. అయితే ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పడంతో నరసరావుపేట పోలీసులకు పోసానిని అప్పగించారు. కాగా గత 2024వ సంవత్సరం 14వ తేదీన పోసాని కృష్ణమురళిపై గుంటూరు జల్లా నరసరావుపేట రెండో పట్టణ పోలీసుస్టేషన్లో టీడీపీ నాయకుడు కొట్టా కిరణ్ పిర్యాదు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లపై పోసాని కృష్ణమురళి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాజాగా పీటీ వారెంట్‌పై పోసానిని అదుపులోకి తీసుకున్నారు. సినీ రంగంలో కులాలు వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా అనుచిత వ్యాఖ్యలు చేశారనే అభియోగాలపైన ఓబులవారిపల్లె పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఇప్పుడు ఇదే అంశాలపైన వివిధ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు కాగా, పీటీ వారెంట్‌లపై పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు.

## పంచాయతీ ఛాంపియన్స్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ



నందిగామ (చైతన్యరథం): మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పంచాయతీ ఛాంపియన్స్ మహిళలతో క్యాండిల్ నిర్వహించారు. సోమవారం వీరులపాడు మండలంలోని బోడవాడ, జమ్మవరం గ్రామ ప్రజలతో పంచాయతీ ఛాంపియన్స్ సమావేశం నిర్వహించారు. అనంతరం మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించి సాధికారత దిశగా అడుగువేయాలని, ఇందుకోసం పంచాయతీ ఛాంపియన్స్ అవసరమైన సహకారం అందిస్తారని ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్స్ జివి నరసింహారావు, సొంగా సంజయ్ వర్మ తెలిపారు. అదే విధంగా ఎంపి కేశినేని శివనాథ్ మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని అభివృద్ధి సాధించేందుకు అందిస్తున్న సహకారం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మవరం టీడీపీ అధ్యక్షుడు కిలారు వెంకట సత్యనారాయణ, బోడవాడ గ్రామ టీడీపీ అధ్యక్షులు మద్దిలేని లక్ష్మణరావు, మండల సమైక్య అధ్యక్షురాలు సిహెచ్ కృష్ణకుమారి, ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్స్ సొంగా సంజయ్ వర్మ, జీవీ నరసింహారావు, వీరులపాడు మండల జనసేన అధ్యక్షుడు బేతపూడి జయరాజ్, బోడవాడ గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు గుంటి వీరయ్య, తాటి గుమ్మి గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు రోశయ్య, బోడవాడ టీడీపీ నాయకుడు రాయల సత్యం, పంచాయతీ ఛాంపియన్స్ కె.సునీల్, ఎస్.సురేష్, వై.ప్రదీప్, కె.రాము, హనుమంతరావు, గోపి, శ్రీను, జివి సత్యనారాయణ, కెవి నరసింహరావులతో పాటు డ్వాక్రా సంఘ మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర పునర్నిర్మాణానికి సీఎం చంద్రబాబు కృషి

**అసెంబ్లీ సమావేశాల్లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి నెల్లూరు జిల్లాకు భారీ కేటాయింపులపై హర్షం**



కోవూరు, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్నిర్మాణమే ధ్యేయంగా తాజా బడ్జెట్ కనిపిస్తోందని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాలనా దక్షతకు అద్దం పడుతోందన్నారు. సోమవారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆమె అసెంబ్లీలో మాట్లాడారు. 2025-26 బడ్జెప్ పై సభలో తనకు మాట్లాడే అవకాశం ఇచ్చిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడకు కృతజ్ఞతలు తెలిపారు. పేదలను బలోపేతం చేసే విధంగా బడ్జెట్ రూపొందించారన్నారు. గత ప్రభుత్వ అసమర్థ పాలన, నిర్లక్ష్యంతో ఆర్థికంగా కుదేలైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక పరిపుష్టిని కలిగించే విధంగా బడ్జెట్ రూపొందించినందుకు సభా ముఖంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే రాష్ట్రాభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తున్న ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులు చేయడం ద్వారా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థమవుతోందని స్పష్టం చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్, జల వనరులు, రహదారుల అభివృద్ధి, పింఛన్లు, ఐటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా సంక్షేమానికి ఉదారంగా కేటాయింపులు జరిపి అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతను నిరూపించారన్నారు. బడ్జెట్ లో మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేసిందని, మహిళా శిశు సంక్షేమానికి రూ.4332 కోట్లు కేటాయించడం గర్వించదగిన విషయమని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇప్పటికే దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తూనే, తల్లికి వందనం పథకానికి రూ.9,407 కోట్లు కేటాయించారన్నారు. అంగన్వాడీలు, ఆశా వర్కర్లకు మేలు చేసేలా అంగన్వాడీల గ్రాట్యుటీ చెల్లింపుల కోసం 2025-26 బడ్జెట్ లో 60 కోట్లు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. అంగన్వాడీల నిర్వహణకు రూ.878 కోట్లు కేటాయించ ద్వారా వాటి బలోపేతానికి సహకారం అందించారని కొనియాడారు. నెల్లూరు జిల్లాకు చెందిన సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించారని గుర్తు చేశారు. తెలుగు గంగ ప్రాజెక్ట్ కు బడ్జెట్ లో రూ.345 కోట్లు, సోమశిల జలాశయానికి రూ.266 కోట్లు కేటాయించి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. జిల్లాకు తలమానికమైన విక్రమ సింహపురి యూనివర్సిటీకి రూ.20.53 కోట్లు కేటాయించడం కొత్త పరిశోధనలకు తోడ్పాడు అందనుండటం సంతోషం కలిగించే అంశమన్నారు. రామాయపట్నం పోర్టుకు రూ.100 కోట్లు, అన్నదాత సుఖీభవ కింద జిల్లాలో 1.77 లక్షల మంది రైతులకు రూ.247 కోట్లు పంపిణీ కాబోతున్నాయని, జిల్లాలో 12 వేల మంది మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం పెంచిన విధంగా వేట నిషేధ భృతి అందజేస్తామని స్పష్టం చేశారు. కొవడలూరు మండలంలో ఉన్న కిసాన్ సెజ్‌కు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానని, ముఖ్యమంత్రి గారి మార్గదర్శకత్వంలో తాను నిత్యం ప్రజా సేవలో ఉంటానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు.

# కనిగిరి సమస్యలపై కనికరించండి

**శాసన సభలో గళమెత్తిన ఎమ్మెల్యే ఉగ్ర**



కనిగిరి, (చైతన్యరథం), (చైతన్యరథం): తన నియోజకవర్గం వెనకబడిన ప్రకాశం జిల్లాలో ఉందని సమస్యలన్నీ ముప్పేట దాడి చేస్తున్నాయని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు, సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆయన తన నియోజకవర్గ సమస్యలపై గళమెత్తారు. రైతుల వ్యవసాయ విద్యుత్, ఫ్లోరైడ్ సమస్యలను ప్రత్యేకంగా ప్రస్థావించారు. నియోజకవర్గంలో 1 లక్ష వరకు ఇంటి కనెక్షన్లు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 35 వేల వరకు ఉన్నాయన్నారు. ఎంతో కాలంగా అగ్రికల్చరల్ కనెక్షన్ల కోసం 329 మంది రైతులు ఎదురు చూస్తున్నారన్నార. ప్రకాశం జిల్లాలో సుమారు 4000 మంది వరకు ఉన్నారన్నారు. నియోజకవర్గాన్ని నీటి సమస్య వెంటాడుతోందన్నారు. వర్షాభావ ప్రాంతం కావడంతో రైతులు బోరుబావులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం నగదు చెల్లించినా అధికారులు ఇవ్వడం లేదన్నారు. రైతుల పొలాల్లో ట్రాన్స్ఫార్మర్స్ కాపర్ తీగ దొంగతనాలు జరిగాయన్నారు. పోలీసులు ఈ కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యం వల్ల ట్రాన్స్ఫార్మర్స్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యపై దృష్టిసారించి పరష్కారానికి చొరవ చొరవ చూపాలని కోరారు. ప్రకాశం జిల్లా వెనుకబడిన క్షామ పీడిత ప్రాంతమన్నారు. త్రాగు నీరు, సాగు నీటి సమస్య బాధిస్తోందన్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉందని ఇక్కడ ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి రాయితీ ఇవ్వాలని కోరారు.

# సమగ్రాభివృద్ధి కోసం మెరుగైన మాస్టర్‌ప్లాన్

**సమీక్ష సమావేశంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి వెల్లడి**

**- పలు కీలక అంశాలపై చర్చ, అభివృద్ధిలో ఎక్కడ రాజీపడొద్దని వెల్లడి**

నెల్లూరు, (చైతన్యరథం): వేగంగా అభివృద్ధి చెందుతున్న నెల్లూరు జిల్లాలో కీలక పాత్ర పోషించబోతుందని నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నుడా పరిధిలో పెద్ద ఎత్తున పరిశ్రమలు రానున్నాయని వెల్లడించారు. నుడా మాస్టర్ ప్లాన్ పై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.. గత వైసిపి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ ను పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నుడా పరిధిలో ఏ ఏ ప్రాంతాలలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలో మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. 2211 చదరపు కిలోమీటర్ల పరిధిలో నుడా అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చైర్మన్ కోటంరెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. మాష్టర్ ప్లాన్ తయారీకి అవసరమగు గ్రామ పటములు, ప్రభుత్వ భూముల వివరాలను జాయింట్ కలెక్టర్ సహకారం తీసుకుంటామని, జిల్లా అధికారుల అధికారులు సహకారంతో నుడాను రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానానికి తీసుకు రావడము, భవిష్యత్తు తరాలు చెప్పుకునేలా అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. అందుకోసం తాను కూడా కష్టపడి పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి హిమబిందు, నుడా సెక్రటరీ పెంచలరెడ్డి, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు



# నిరుద్యోగులకు ఊపిరి పోసిన మంత్రి లోకేష్

**వైసీపీ గాలికొదిలేసిన సమస్యకు పరిష్కారం**

**ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన గొట్టిపాటి లక్ష్మి**



దర్శి, (చైతన్యరథం): గత ఐదేళ్ళు వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను గాలికి వదిలేసిందని దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలల కాలంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చురుగ్గా అడుగులు వేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సోమవారం అసెంబ్లీలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ త్వరలో మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చేసిన ప్రకటన నిరుద్యోగ యువతకు ఊపిరి పోసిందన్నారు. ఆనాడు టీడీపీ జాతీయ కార్యదర్శి హెూదాలో నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీ సాక్షిగా మాట నిలబెట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఒక్కొక్క హామీని అమలు చేస్తూ ముందుకు వెళ్తోందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 16,347 టీచర్ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని విద్య ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించకుండా నిరుద్యోగ యువతను దగా చేసిందన్నారు. గత 30 ఏళ్లలో టీడీపీ ప్రభుత్వం హయాంలో 13 డీఎస్సీలోని నిర్వహించి 1,80, 272 టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత విజనరీ సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్ర విభజన తరువాత కూడా నవ్యాంధ్రప్రదేశ్ 2014-19 మధ్య ఆయన నేతృత్వంలో మూడు డీఎస్సీలను నిర్వహించి 16,701 టీచర్ల పోస్టులను భర్తీ చేసిన విషయాన్ని కూడా కూషంగా అసెంబ్లీ సాక్షిగా మన గౌరవ విద్యాశాఖ మాత్యులు లోకేష్ గుర్తు చేశారన్నారు. ఈ సందర్భంగా యువత తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాలల్లో కూడా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు నారా లోకేష్ ప్రకటించారన్నారు. అదేవిధంగా ఆనాడు వైసిపి ప్రభుత్వం నాడు నేడు పేరుతో చేసిన అక్రమాలపై కూడా విచారణ చేపడుతున్నట్లు తెలపడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. విద్యాభివృద్ధికి లోకేష్ చేస్తున్న కృషిని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళ మాదిరి ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణానికి విద్యా, వైద్యం ఉపాధి అవకాశాలు పెంపొందించి అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో మన కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుంది. ఇదే స్ఫూర్తితో మన దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మార్చుకుందాం మన కూటమి ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేసే మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ పనులను అన్ని పూర్తి చేసుకునేందుకు నియోజకవర్గ ప్రజల సహకారాన్ని కోరుకుంటున్నానన్నారు.

# అధికారం కోల్పోయినా అబద్ధాలేనా

**మాజీమంత్రి కాకాణిపై తెలుగు రైతుల ఫైర్**




సర్వేపల్లి, (చైతన్యరథం): అధికారం కోల్పోయినా మాజీ మంత్రి అబద్ధాల ధోరణి మారలేదని తెలుగు రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరు రాధాకృష్ణమ నాయుడు ధ్వజమెత్తారు. వెంకటాచలం మండలం కసుమూరులో రైతులతో మాట్లాడిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కల్లబొల్లి మాటలతో రైతులను రెచ్చగొడుతున్నారన్నారు. రైతుల వద్ద ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతున్నారు. దళారులు, మిల్లర్ల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నదాతలను కోరుతున్నామన్నారు. ఓపికగా వ్యవహరించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. రైతుకు ఏ కష్టం వచ్చినా తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయ శాఖను మూతేసిన వారు ఇప్పుడు రాజకీయాలు చేయొద్దని వైసీపీ నేతలకు హితవు పలుకుతున్నామన్నారు. కాకాణి నోట నిజాలు రావడం లేదన్నారు. కంటితుడుపు చర్యగా కసుమూరుకు వచ్చి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయక రైతుల కష్టాలు పడుతున్నారని కథలు చెప్పారన్నారు. సోమవారం ఆరా తీస్తే బీపీటీ ధాన్యానికి మంచి ధర వస్తుందని తామే బాగా ఆరబెట్టుకుంటున్నామని రైతులు చెప్పారన్నారు. నిర్మాణాత్మకు ప్రతిపక్ష పాత్ర పోషించి రైతులకు మంచి చేస్తే సంతోషిస్తామన్నారు. కానీ గోవర్ధన్ రెడ్డి లేనిపోని మాటలు చెప్పి గందరగోళం సృష్టించడం దురదృష్టకరమన్నారు. వెంకటాచలం మండలంలో ఇప్పటికీ పూర్తి స్థాయిలో వరికోతలు మొదలుకాలేదన్నారు. అక్కడక్కడా కోతలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే చవటపాళెం సొసైటీ పరిధిలో 19 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. వైసీపీ హయంలో పుట్టికి రూ.28 వేలు వచ్చిందని కాకాణి గొప్పలు చెబుతున్నారన్నారు. డిమాండ్, ఉత్పత్తిని బట్టి, పొరుగు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఉత్పత్తి తగ్గడం, విదేశాలకు ఎగుమతులు జరగడం తదితర పరిస్థితులు కారణంగా అప్పట్లో మంచి ధర పలికిందన్నారు, మార్కెట్‌లో ధరలు పెరగడం, తగ్గడం ఎవరి ఘనత కాదని కాకాని గోవర్ధన్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. కాకాణి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే 2021లో పుట్టి రూ.6 వేలు, రూ.7 వేలకు ధర పడిపోయిందని గుర్తు చేశారు.ఆ సమయంలో కనీస మద్దతు ధర రూ.18 వేలు ఉండగా, ఆరేడువేలకు కొని రైతులను దోచుకున్నారని ఆరోపించారు. పుట్టికి 850 కిలోలు కొలవాల్సివుంటే 1,100 కిలోలు కొలిపించి .జిల్లా చరిత్రలో తొలిసారిగా పుట్టికి అర్థం మార్చింది మీరు కాదా అని నిలదీశారు. మొన్నటి దాకా జగన్ రెడ్డి ప్రభుత్వంలోనే వానలు కురుస్తాయని, పంటలు పండుతాయని ప్రగల్భాలు పలికారని ప్రస్తుతం రెండో పంటకు కూడా నీళ్ళున్నాయని తెలిసి నీళ్ళు నములుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలోనూ విరుగుళ్ల కారణంగా రైతులకు సమస్య తలెత్తితే వ్యవసాయ శాఖ మంత్రిగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పందించి ప్రభుత్వంతో బోనస్ ఇప్పించారని గుర్తు చేశారు. అధికారం ఉన్నా, లేకున్నా రైతులకు అండగా నిలవడంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎప్పుడూ ముందుంటారన్నారు. దళారులు, మిల్లర్ల మాట నమ్మి మోసపోవద్దన్నారు. ఏ ఇబ్బంది వచ్చినా తెలుగుదేశం పార్టీకి అండగా ఉంటుందన్నారు. రైతుల సమస్యలను అసెంబ్లీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు.

# పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించండి

## మంత్రి లోకేష్‌ను కోరిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



పుట్టపర్తి, (చైతన్యరథం): పుట్టపర్తి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రశ్నోత్తరాల సమయంలో సోమవారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పుట్టపర్తి నియోజకవర్గ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై, ప్రభుత్వం దృష్టికి ఈ సభ ద్వారా తీసుకొచ్చారు. సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ, విద్యారంగంలో ప్రక్షాళన తీసుకురావాలనే మంచి ఉద్దేశ్యంతో విద్యా శాఖ లో సమూలమైన సమగ్రమైన మార్పు తీసుకొస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వర్యులు నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా సత్యసాయి జిల్లాలోని మా పుట్టపర్తి నియోజకవర్గం లో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ ,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ,జిల్లా పరిషత్ హై స్కూల్స్, కేజీబీవీ, మోడల్ స్కూల్ అన్ని కలిపి సుమారు 319 దాకా ఉన్నాయని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో సుమారు 57 పాఠశాలలకు ప్రహరీ గోడలు లేవని మంత్రి నారా లోకేష్‌కు వివరించారు. వాటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి తగిన నిధులు కేటాయించి సకాలంలో వాటి ప్రహరీ గోడలు నిర్మాణం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో నాడు... నేడు ద్వారా ప్రభుత్వ స్కూల్స్ భవన నిర్మాణ పనులు జరిగాయని, అందులో చాలా వరకు సిమెంట్ లేకపోవడం, తగిన నిధులు లేక పోవడంతో అవి అసంపూర్తిగా ప్రభుత్వ పాఠశాల భవనాలు ఉన్నాయన్నారు. వాటిని ఈ ప్రభుత్వం ద్వారా మళ్ళీ పునః ప్రారంభించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని ప్రత్యేకంగా కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని సుమారు 106 పాఠశాలల పైకప్పు శిథిలావస్థకు చేరుకుని వర్షాకాలంలో లీకేజ్ అవుతున్నాయని, ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు . అంతేకాకుండా విద్యార్థులకు సరిపడే తరగతి గదులు లేవని వీటికి అదనపు తరగతి గదులు నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా మా నియోజకవర్గంలోని 14 ప్రభుత్వ పాఠశాలలో వంటగదులు లేవని మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. విద్యార్థులు మంచినీళ్ళు త్రాగేందుకు మరో 38 పాఠశాలలో త్రాగునీటి శుద్ధి కేంద్రాలు ఎంతో అవసరమని వాటిని తక్షణం ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు నీటి దాహర్తి తీరుతుందని మంత్రిని కోరారు. అదే విధంగా పాఠశాలల్లో అత్యంత ప్రధానమైన సమస్య మరుగుదొడ్ల సమస్య అన్నారు. సుమారు 11 పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటి నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే మంత్రి ప్రశ్నకు లోకేష్ స్పందించారు. పుట్టపర్తి నియోజకవర్గం లో ఎమ్మెల్యే అడిగిన సమస్యలను దశలవారీగా ప్రభుత్వం పనులు చేపడుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణానికి సుమారు 3000 కోట్లు పైగా నిధులు అవసరమవుతాయని మంత్రి సభ దృష్టికి తీసుకొచ్చారు అయితే మనబడి మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా అలాగే జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణ పనులకు చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. వన్ స్టార్ టూ స్టార్ గ్రేడింగ్ ప్రకారం పాఠశాలల అభివృద్ధికి ముందుకు వెళ్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వర్షాకాలంలో పాఠశాల పైకప్పు లీకేజ్ అవుతున్న పాఠశాలల భవనాలను త్వరగా మరమత్తు పనులు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలు ఇస్తామని వెల్లడించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, వంట గదులు ,మరుగుదొడ్లు నిర్మాణం జరిగేలా ప్రభుత్వం తప్పకుండా చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు మంత్రి నారా లోకేష్ ప్రభుత్వం ద్వారా వెల్లడించారు.

# పుట్టపర్తి విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తా

**- మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ**

**- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వినతిపై స్పందన**



పుట్టపర్తి, (చైతన్యరథం): పుట్టపర్తి నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే రెడ్డి ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం విజయవాడలోని ఉండవల్లిలో విద్యుత్ మంత్రి చాంబర్లో ప్రత్యేకంగా కలిసి పుట్టపర్తి నియోజకవర్గంలో వ్యవసాయ సర్వీసుల , విద్యుత్ సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అతి ముఖ్యంగా రైతులకు సంబంధించి వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు అదనంగా మంజూరు చేయాలని వాటికి సంబంధించిన కండక్టర్లు, కేబుల్ వైర్లు తదితర పరికరాల కొరత ఎక్కువగా ఉందని మంత్రి దృష్టికి తీసుకుపోయారు. నియోజకవర్గంలో విద్యుత్ శాఖలో అధికారుల కొరత ఎక్కువగా ఉందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గంలో రైతుల నుంచి ఎక్కువగా విద్యుత్ సమస్యలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని కొంతమంది విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ప్రత్యేకంగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి మంత్రి గొట్టి పాటి రవికుమార్ సానుకూలంగా స్పందించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి హామీ ఇచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన విద్యుత్ అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నియోజకవర్గానికి సరిపడే విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు వాటికి అవసరమయ్యే పరికరాలను సకాలంలో రైతులకు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

# వైసీపీ నిర్లక్ష్యం.. పాఠశాల విద్యార్థులకు పెనుశాపం

**చొరవతో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే శ్రావణి వినతి సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్**



శింగనమల, (చైతన్యరథం): అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శింగనమలతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో ప్రహరీగోడల నిర్మాణాలు చేపట్టాలని , మౌలిక సదుపాయాలను కల్పించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిందన్నారు. నాడు-నేడు కార్యక్రమం కింద కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి, పనులు పూర్తి చేయకుండా సగంలో ఆపేసిన అసమర్థత వైసీపీదన్నారు. స్కూల్స్ కు వైసీపీ పార్టీ రంగులు వేసి నిధులన్నీ దుర్వినియోగం చేశారని విమర్శించారు.

శింగనమల నియోజవర్గంలోని ప్రభుత్వ స్కూళ్లలో దాదాపు 35 స్కూళ్లకు కాంపౌండ్ గోడలు లేవన్నారు. కొన్ని స్కూళ్లకు గోడలు ఉన్నా లేనట్లే, ఆ గోడలు ఎప్పుడు ఏ టైం కు కూలిపోతాయో తెలియని పరిస్థితి ఉందన్నారు.

కేజీబీ గర్ల్స్ స్కూల్లలో కనీసం 5 అడుగుల ప్రహరీ గోడలు, ఫెన్సింగ్ లేకపోవడంతో ఆకతాయిలు జూదము ఆడడం, మద్యం సేవించే పరిస్థితితో బాలికలకు రక్షణ లేకుండా పోయిం పాఠశాల ఆవరణలో కుక్కలు, పాములు, పశువులు సంచరిస్తూ, కాంపౌండ్ లో అపరిశుభ్రత నెలకొందని వివరించారు. ఇక వర్షాకాలంలో చెత్తా చెదరాలతో కూడిన నీరు పాఠశాల ఆవరణంలోకి రావడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ కారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. ఈ వివరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. స్కూల్ కాంపౌండ్ వాల్స్‌తో పాటు డ్రింకింగ్ వాటర్ సౌకర్యం, టాయిలెట్స్ ఏర్పాటు, అలాగే భద్రత కోసం సీసీ కెమెరాలు, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సభాపతి ద్వారా విద్యా శాఖ మంత్రి లోకేష్‌ను కోరారు.

# మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలి

**- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి**

**- 25 ఏళ్లుగా అసంపూర్తిగా వున్న ఆటోనగర్ పూర్తి చేయాలి**

**- అసెంబ్లీలో గళం వినిపించిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా**



మదనపల్లె, (చైతన్యరథం): మదనపల్లి పట్టణంలో గడిచిన 25 ఏళ్లుగా పెండింగులో వున్న ఆటోనగరను పూర్తి చేయాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా కోరారు.సోమవారం జరిగిన బడ్జెట్ శాసనసభ సమావేశాల్లో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ ఆటో నగర్ విషయంలో ఏపిఐఐసి డిపార్ట్మెంటుకు ఆదేశాలు ఇవ్వాలని స్పీకర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.ఆటోనగరలో నెలకొన్న భూ సేకరణ కోర్టు కేసును పరిష్కారం చేయాలన్నారు.మదనపల్లిలో ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు మదనపల్లిని జిల్లా కేంద్రంగా ప్రకటించాలన్నారు.ఇది నియోజకవర్గ ప్రజల చిర కాలం స్వప్నమని పేర్కొన్నారు.1860 నుండే మదనపల్లి పరిపాలన రాజధానిగా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు.నేడు మదనపల్లి పట్టణంలో రెండు లక్షలు జనాభా కలిగి ఉందన్నారు.ఈ నేపథ్యంలో రోడ్లు విస్తరణ చాలా అవసరం ఉందని,కావున ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.మదనపల్లి నుండి రామసముద్రం నిమ్మనపల్లి మండల కేంద్రాలకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలని కోరారు.మదనపల్లి పరిసర ప్రాంతాల్లో డీకేటీ భూములు పరిరక్షణకు ప్రత్యేకంగా టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయాలని కోరారు. మదనపల్లికి ఇరువైపులా కర్ణాటక రాజధాని బెంగుళూరు, తమిళనాడు రాజధాని చెన్నై ఉందని ఈ నేపథ్యంలో మదనపల్లిలో వంద ఎకరాల్లో ఐటీ కారిడార్ అభివృద్ధి చేసే దిశగా మంత్రి దృష్టి సారించాలని కోరడం జరిగింది.అదేవిధంగా నియోజకవర్గం అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

# వక్ఫ్ ఆస్తులను పరిరక్షించి, అభివృద్ధి చేస్తాం

## ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్


నెల్లూరు, (చైతన్యరథం): హైదరాబాద్ నగరంలోని బీకే గూడా, ఎస్సార్ నగర్, హిమాయత్ నగర్‌లలోని కర్నూల్ అంజుమన్ – ఏ – ఇస్లామియాకు సంబంధించిన వక్ఫ్ ఆస్తులను ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ పరిశీలించారు. బీకే గూడలోని 3.40 ఎకరాల వక్ఫ్ భూమిని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, రాగ్ పికర్స్ ఆక్రమించారని ఆయన తెలిపారు. ఆక్రమణకు గురైన వక్ఫ్ భూమిని అబ్దుల్ అజీజ్ పరిశీలించారు. పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ, బీకే గూడా లో ఏపీ వక్ఫ్ బోర్డ్ కు చెందిన స్థలంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డంపింగ్ యార్డ్ నిర్వహిస్తుందని తెలిపారు. దీనిపై జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి ఇక్కడి నుండి డంపింగ్ యార్డ్‌ను తరలిస్తామని పేర్కొన్నారు. హిమాయత్ నగర్‌లోని పాత షాపింగ్ కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేస్తామని తద్వారా వక్ఫ్ బోర్డ్‌కు ఆదాయాన్ని పెంచుతామని స్పష్టం చేశారు. వీటికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలను తక్షణమే ప్రారంభించి అందుకు అనుగుణంగా బృహత్తర ప్రణాళిక రూపొందించాలని వక్ఫ్ బోర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అబ్దుల్ ఖాదీర్‌కు అబ్దుల్ అజీజ్ సూచించారు.



# అందరితో కలసి మెలసి నడచుకునే నాయకుడు జయచంద్రుడు

మొలకలచెరువు, (చైతన్యరథం): తంబళ్లపల్లె తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ జయచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి నాయకులతో పాటు కోటం నాయకులు కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయచంద్రరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జయచంద్రారెడ్డి స్వగృహం నుంచి స్థానిక మూడు రోడ్లు కూడలి వరకు నాయకులు కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలో నాయకులు కార్యకర్తలు ఏర్పాటుచేసిన 50 కిలోల భారీ కేక్ కోసి పంచిపెట్టారు. అక్కడ కేక్ కోసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలోనీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక నాయకుడు జయచంద్రారెడ్డి అన్నారు. అనంతరం కురబలకోటలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త గిరిధర్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త సీట్ మల్లికార్జున నాయుడు, మండల కన్వీనర్లు రెడ్డప్పరెడ్డి, వైజే సురేంద్ర, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి సురేష్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.వి రమణ, సర్పంచ్ జనార్దన్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.





# జీవ వైవిధ్య సంరక్షణకు సమష్టి కృషి

## ప్రపంచానికి ప్రధాని మోదీ పిలుపు

ప్రధాని నరేంద్ర మోదీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో ఉన్నారు. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం ప్రధాని మోదీ జునాగఢ్ జిల్లాలోని గిర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి వెళ్లారు. అందులో భాగంగా ఆయన లయన్ సఫారీ చేశారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు, అటవీశాఖ అధికారులు ఉన్నారు. భూమిపై ఉన్న అపురూపమైన జీవవైవిధ్యాన్ని సంరక్షించడానికి ప్రపంచంలోని ప్రజలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయేతరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వడానికి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వన్యప్రాణులను సంరక్షించడంలో భారతదేశం చేస్తున్న కృషికి గర్వపడుతున్నట్లు పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా మోదీ ఆదివారం రిలయన్స్ జామ్ నగర్ రిఫైనరీ కాంప్లెక్స్‌లోని జంతు సంరక్షణ, పునరావాస కేంద్రం వంతారాను, సోమనాథ్ దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం సాసన్‌లోని రాష్ట్ర అటవీశాఖ అతిథిగృహం సిన్హ్ సదన్‌లో బస చేశారు. సోమవారం తెల్లవారుజామున గిర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. మధ్యాహ్నం గిర్ వన్యప్రాణుల అభయారణ్యం ప్రధాన కార్యాలయమైన ససన్ గిర్‌లో నిర్వహించనున్న నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించనున్నారు. ఇందులో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, వివిధ రాష్ట్రాల సభ్యులు, వన్యప్రాణి సంరక్షణకు కృషి చేస్తున్నట్లు పలు ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొంటారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని ససన్‌లోని అటవీ సిబ్బందితో సంభాషించనున్నట్లు సమాచారం.

**ప్రాజెక్ట్ లయన్ కోసం రూ.2,900 కోట్లు**

ఆసియాటిక్ సింహాలను సంరక్షించే లక్ష్యంతో ప్రాజెక్ట్ లయన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2,900 కోట్లకు పైగా నిధులు మంజూరుచేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం ఆసియాటిక్ సింహాలు గుజరాత్లోని గిర్ అడవుల్లో దాదాపు 30,000 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి.

# రాజ్యాంగంపై అవగాహన అవసరం

## - పోలీసులకు సుప్రీం సూచన



భావప్రకటనా స్వేచ్ఛకు సంబంధించి సుప్రీం కోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అయ్యిందని, పోలీసులు కనీసం ఇప్పుడైనా వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛను అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. రెచ్చగొట్టే పాటను షేర్ చేశారనే ఆరోపణలపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ ఢీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ విధంగా స్పందించింది. ఈ కేసు తీర్పును రిజర్వ్ చేసింది. గుజరాత్ జామ్నగర్లో ఇటీవల జరిగిన ఓ సామూహిక వివాహాల కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ ఢీ పాల్గొన్నారు. అనంతరం ఓ పద్యంతో కూడిన వీడియోను తన సామాజిక మాధ్యమ ఖాతాలో షేర్ చేయడం వివాదాస్పదమయ్యింది. ఆ పాట ప్రజలను రెచ్చగొట్టేలా ఉందని పేర్కొంటూ గత జనవరి 3న ఎంపీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ తొలుత గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆయనకు ఊరట లభించలేదు. దీంతో ప్రతాప్ ఢీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) కింద భావప్రకటనా స్వేచ్ఛ, ప్రాథమిక హక్కు పరిరక్షణ ప్రాముఖ్యతను మరోసారి వివరించింది. అది కేవలం పద్యం మాత్రమేనని, అనువాదంలో కొంత సమస్య ఏర్పడి ఉండవచ్చని అభిప్రాయపడింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు పోలీసులు కొంత సున్నితత్వాన్ని ప్రదర్శించాలని పేర్కొంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతుండగా.. కనీసం ఇప్పటికైనా భావప్రకటనా స్వేచ్ఛ గురించి పోలీసులు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది.

# మూఢాచార మహమ్మారికి పసికందు బలి

## నెలల బాలుడి శరీరంపై నలభై వాతలు




మూఢాచార మహమ్మారి ఓ పసికందుకు ప్రాణసంకటంగా పరిణమించింది. చికిత్స పేరుతో అనారోగ్యంతో బాధపడుతున్న నెల రోజుల శిశువుకు కుటుంబ సభ్యులు ఇనుప కడ్డీని కాల్చి శరీరంపై 40 వాతలు పెట్టారు. ఒడిశాలోని నవరంగాపూర్ జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ సిబ్బంది చిన్నారిని వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. గంభరిగూడ పంచాయతీ పరిధిలోని ఓ గ్రామంలో ఈ ఘటన వెలుగుచూసింది. గ్రామానికి చెందిన కుటుంబంలోని నెల రోజుల వయసున్న ఓ చిన్నారి వారం రోజులుగా తీవ్ర జ్వరం, జలుబుతో బాధపడుతోంది. ఎంతకీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో కుటుంబసభ్యులు పసివాడికి గాలి సోకిందని భావించారు. వైద్యం అందించడానికి బదులు మూఢనమ్మకాలకు ప్రభావితమై.. ఇనుప కడ్డీని కాల్చి దానితో శిశువు శరీరంపై 40 చోట్ల వాతలు పెట్టారు. ఈ నేపథ్యంలో చిన్నారి ఆరోగ్యం మరింత క్షీణించడంతో పంచాయతీ సిబ్బంది స్థానిక ఉమర్ కోట్ ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అనారోగ్యం పాలైన వారికి ఈ విధంగా వేడి లోహంతో ముద్ర వేయడం వల్ల శరీరంపై ఉన్న దుష్టశక్తులు పోతాయని అక్కడి వారు నమ్మతారని అధికారులు పేర్కొన్నారు. ఇదే విధంగా చిన్నారి తలపై, కడుపుపై 40 వాతలు పెట్టారని అన్నారు. విషయం తెలుసుకున్న నవరంగాపూర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ పండా ఆస్పత్రిని సందర్శించి శిశువు ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. మారుమూల గ్రామాల ప్రజలు మూఢనమ్మకాల బారిన పడకుండా వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# ఐఐటీ బాబాపై కేసు నమోదు



ఇటీవల ప్రయాగ్రాజ్ వేదికగా జరిగిన అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక కుంభమేళాలో ఐఐటీ బాబాగా అభయ్ సింగ్ పాపులర్ అయిన సంగతి తెలిసిందే. మరోసారి ఆయన వార్తల్లో నిలిచారు. ఇటీవల తనపై దాడి జరిగిందని ఆరోపిస్తూ.. ఆత్మహత్య చేసుకుంటానని ఆయన సోషల్ మీడియా వేదికగా పలు పోస్ట్ చేశారు. తాజాగా అతడు జైపుర్‌లో కొందరు వ్యక్తులతో తగాదాకు దిగినట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆయనను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా ఐఐటీ బాబా వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాను ఎటువంటి తగాదాలకు వెళ్లలేదని తన అనుచరులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకొంటున్నానని చెప్పారు. ఆయనపై నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డిపిఎస్) చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే ఆయన వద్ద లభించిన గంజాయి అనుమతించదగిన పరిమితిలో ఉండడంతో కొన్ని గంటల తర్వాత ఆయనను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. హరియాణాకు చెందిన అభయ్ సింగ్.. ఐఐటీ బాంబేలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ పూర్తిచేసినట్లు చెబుతున్నారు. కొంతకాలం కార్పొరేట్ సంస్థలో పనిచేసిన ఆయన.. దాన్ని వదులుకొన్నారు. ఈక్రమంలో ఆధ్యాత్మికం వైపు అడుగులు వేశారు. కుంభమేళాకు వచ్చి ఓ వార్తా ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇవ్వడంతో ఆయన పేరు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది.



# అసభ్య పదజాలం హాస్యం కాదు

## భావ ప్రకటనా స్వేచ్ఛ ఇష్టారాజ్యం కాదు - యూట్యూబర్‌కు చురకలేసి వదిలిన సుప్రీం

ఇండియాస్ గాట్ లాటెంట్’ వేదికగా యూట్యూబర్ రణవీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు దేశమంతటా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో అల్హాబాదియాకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. పాడ్‌కాస్ట్‌ను రద్దు చేయాలన్న ప్రాసిక్యూషన్ వాదనను తిరస్కరించిన న్యాయస్థానం దానిని తిరిగి పునఃప్రారంభించేందుకు యూట్యూబర్‌కు అనుమతి ఇచ్చింది. ఈ సందర్భంగా అల్హాబాదియాకు న్యాయస్థానం మరోసారి చురకలు అంటించింది.

భావప్రకటనా స్వేచ్ఛకు పరిమితులు ఉన్నాయని, అసభ్య పదజాలం వాడటం హాస్యం కాదని మందలించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు అరెస్టు నుంచి రక్షణను పొడిగించిన ధర్మాసనం.. గువహాటిలో నమోదైన కేసులో దర్యాప్తునకు హాజరు కావాలని ఆదేశించింది. నైతికత, భావప్రకటనా స్వేచ్ఛను సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది. డిజిటల్ కంటెంట్స్‌పై మార్గదర్శకాలు రూపొందించేటప్పుడు ఈ అంశాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.



# నవ దంపతులు.. త్వరగా పిల్లల్ని కనండి!

## సీఎం స్టాలిన్

లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే. తమిళనాడు రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై తాజాగా మరోసారి స్పందించిన స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పునర్విభజనతో నష్టం జరగకుండా ఉండాలంటే కొత్తగా పెళ్లయిన జంటలు అత్యవసరంగా పిల్లల్ని కనాలని కోరారు. నాగపట్నంలోని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ స్టాలిన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. నవ దంపతులు సంతానం విషయంలో కొంత సమయం తీసుకోవాలని గతంలో తానే చెప్పానని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు మారాయని, నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోన్న వేళ ఇప్పుడలా చెప్పలేనని పేర్కొన్నారు. అంతకుముందు కుటుంబ నియంత్రణపై దృష్టిసారించామన్నారు. కానీ ఇప్పుడు జనాభా పెంచుకోక తప్పని పరిస్థితుల్లోకి నెట్టివేయబడ్డామన్నారు. అందుకే తాను కోరుకునేది ఒక్కటేనని, కొత్తగా పెళ్లయిన దంపతులు త్వరగా పిల్లలను కనాలని వారికి మంచి తమిళ్ పేర్లు పెట్టాలని సీఎం స్టాలిన్ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొళత్తూర్‌లోని ఓ వివాహ వేడుకలోనూ స్టాలిన్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. “పరిమితంగా పిల్లలను కని సంపదతో జీవించాలనే ఉద్దేశంతో కుటుంబ నియంత్రణ ప్రచారాన్ని చేపట్టాం. కానీ, దీని కారణంగా రానున్న కాలంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడు లోక్‌సభ స్థానాలు తగ్గే పరిస్థితి ఏర్పడింది” అని వ్యాఖ్యానించారు. మరోవైపు, ఈ అంశంపై చర్చించేందుకు ఈనెల 5న సీఎం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొనాలంటూ ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాష్ట్రంలోని 40కు పైగా పార్టీలకు ఆహ్వానం పంపారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పనులను కేంద్రప్రభుత్వం 2026లో చేపట్టనున్న నేపథ్యంలో జనాభా ఆధారంగా ఇది జరిగితే రాష్ట్రానికి 8 నియోజకవర్గాల వరకు తగ్గుతాయని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పుతిన్ కన్నా వలసదారులే డేంజర్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ కంటే అక్రమ వలసదారులతోనే ముప్పు ఎక్కువ అని అన్నారు. ఈమేరకు ట్రూత్ సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టారు.

"మనం పుతిన్ గురించి ఎక్కువ ఆందోళన చెందాల్సిన పని లేదు. మన దేశంలోకి ప్రవేశించే రేప్ గ్యాంగ్స్, డ్రగ్ లార్డ్స్, హంతకులు, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిపైనే ఎక్కువగా దృష్టిసారించాలి. అప్పుడే మనకు ఐరోపా లాంటి పరిస్థితి ఉండదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. రెండోసారి అమెరికా పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపారు. తమదేశంలో ఉండటానికి సరైన పత్రాలు లేని, అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారిని ట్రంప్ వెనక్కి పంపుతున్నారు. ఈ క్రమంలో ఆయన అనుసరిస్తున్న విధానాలపై నిరసన వ్యక్తమవుతున్నప్పటికీ వెనక్కి తగ్గడం లేదు. దీంతో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. ఆయా దేశాలకు పంపేందుకు అమెరికా వాణిజ్య, సైనిక విమానాలను వినియోగిస్తోంది. అక్రమంగా వలస వెళ్లిన కొందరు భారతీయుల్ని సైనిక విమానాల్లో వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే. అలాగే తాను తీసుకున్న చర్యల వల్లే అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో అక్రమ వలసలు భారీగా తగ్గినట్లు ఇప్పటికే అయన వెల్లడించారు. ఫిబ్రవరిలో కేవలం 8,326 మంది అక్రమ వలసదారులు మాత్రమే దేశ సరిహద్దుల్లో పట్టుబడ్డారని ట్రంప్ పేర్కొన్నారు. జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రతినెలా దేశంలోకి మూడు లక్షలమంది అక్రమంగా ప్రవేశించేవారని గుర్తు చేశారు. ఈ గణాంకాలకు సంబంధించి సీబీపీ విడుదల చేసిన నివేదికలను ఉటంకించారు. దాదాపు 95 శాతం వలసలు తగ్గినట్లు వెల్లడించారు. తన పాలనలో ఎవరైనా చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించాలని ప్రయత్నిస్తే పెద్ద మొత్తంలో జరిమానాలు, తక్షణ బహిష్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అయితే ట్రంప్ ప్రకటనను పలు వార్తాసంస్థలు తప్పుబట్టాయి. ఆయన చూపిన గణాంకాలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని దుయ్యబట్టాయి. అమెరికా కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ విడుదల చేసిన డేటాను ఫాక్స్ న్యూస్ పంచుకుంది. బైడెన్ అధికారంలో ఉన్న చివరి వారంలో దాదాపు 20,086 మంది అక్రమ వలసదారులను గుర్తించినట్లు పేర్కొంది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన మొదటివారంలో 7,287 మంది పట్టుబడ్డారని వెల్లడించింది. అయితే అధ్యక్షుడు పేర్కొన్నట్లు ఈ సంఖ్యలో గణనీయమైన తగ్గుదల అనటం నిజం కాదని.. కేవలం 65శాతం మాత్రమే తగ్గాయని తెలియజేసింది.



# కరోలినా రాష్ట్రాలను కాల్చేస్తున్న కార్చిచ్చు

### సౌత్ కరోలినాలో ఎమర్జెన్సీ విధించిన గవర్నర్ హెన్రీ

అమెరికాలోని ఉత్తర కరోలినా, దక్షిణ కరోలినా రాష్ట్రాల్లో కార్చిచ్చు కమ్మేసింది. ఇప్పటికే వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది దానిని ఆర్పేందుకు తీవ్ర స్థాయిలో యత్నిస్తున్నారు. దక్షిణ కరోలినా రాష్ట్ర అటవీ సంరక్షణ విభాగం ప్రకారం ఇప్పటికే 4.9 చదరపు కిలోమీటర్ల మేరకు అటవీ భూమి దగ్ధమైపోయింది. ఇప్పటి వరకు ఈ కార్చిచ్చులో ఎవరూ గాయపడినట్లు, ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం లేదు. సౌత్ కరోలినాలో అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు ఆ రాష్ట్ర గవర్నర్ హెన్రీ మెక్మాస్టర్ ప్రకటించారు. ఇక పరిస్థితిని అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తునట్లు వెల్లడించారు. మొత్తం 175 ప్రదేశాల్లో మంటలు వ్యాపించాయని వెల్లడించారు. నార్త్ కరోలినాలో నాలుగు వేర్వేరు అటవీప్రాంతాల్లో రేగిన కార్చిచ్చుతో 161 హెక్టార్లు దగ్ధమయ్యాయి. వీటిల్లో ఉవారీ నేషనల్ ఫారెస్ట్‌లో చెలరేగిన మంటలు అతిపెద్దవని అధికారులు చెబుతున్నారు.

### జపాన్‌లో 30 ఏళ్లలో అతిపెద్ద కార్చిచ్చు

జపాన్‌లో గత 30 ఏళ్లలో ఎన్నడూ చూడనంత అతి పెద్ద కార్చిచ్చు వ్యాపించింది. దీంతో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటి వరకు 4,500 ఎకరాల్లో అటవీ సంపద కాలి బూడిదయ్యింది. ఈ మంటలు అసలు ఇప్పట్లో శాంతించేలా లేవని అధికారులు చెబుతున్నారు. ఆ దేశ ఫైర్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ఏజెన్సీ అంచనాల ప్రకారం ఈ కార్చిచ్చును తొలుత బుధవారం గుర్తించారు. నాడు కనీసం 84 ఇళ్లను ఇది కాల్చేసింది. అదే సమయంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం ఉదయం దాదాపు 4,600 మందిని ఇళ్లు ఖాళీ చేయాలని ఆదేశించారు. 1,200 ఇళ్లలోని వారిని అత్యవసర వసతి ప్రదేశాలకు తరలించారు. దాదాపు 1,700 మంది సిబ్బంది మంటలను ఆర్పేందుకు తరలించారు. సహాయక చర్యల కోసం విమానాలను కూడా రంగంలోకి దించారు. 1992లో హొక్కైడో వచ్చిన కార్చిచ్చుతో పోలిస్తే ఇది చాలా పెద్దది. నాడు అది 1,000 హెక్టార్ల అటవీ భూమిని దగ్ధం చేసింది.



# రష్యాకు అనుకూలంగా ట్రంప్ వైఖరి

## సానుకూలంగా స్పందిస్తున్న పుతిన్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి రష్యాకు అనుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ కీలక ఆదేశాలు జారీ చేశారు. రష్యాకు వ్యతిరేకంగా చేపడుతున్న సైబర్ కార్యకలాపాలన్నీ నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే ఈ నిలిపివేత ఎంతకాలం కొనసాగుతుందన్న దానిపై మాత్రం స్పష్టత లేదు. ఈ మేరకు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి అధికారంలోకి వచ్చీరాగానే.. మూడేళ్లుగా యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్-రష్యా మధ్య మధ్యవర్తిగా ట్రంప్ వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో పుతిన్‌ను పొగుడుతూ, జెలెన్స్కీ చర్యలను నిందిస్తూ మధ్యవర్తిత్వాన్ని నెరుపుతున్నారు. ఇటీవల ఉక్రెయిన్ అధినేత జెలెన్స్కీతో మీడియా ఎదుటే వాగ్వాదానికి దిగడం యావత్ ప్రపంచాన్ని నివ్వెరపర్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఓ కథనం వెలువడింది. రష్యా విషయంలో అమెరికా అనుసరిస్తున్న విధానాలను ట్రంప్ యంత్రాంగం పునఃసమీక్షిస్తోంది. అయితే తాజా నివేదికలపై స్పందించేందుకు పెంటగాన్ నిరాకరించింది. సైబర్ ఇంటెలిజెన్స్‌లోని ముఖ్యమైన సమాచారాన్ని తాము బహిరంగంగా పంచుకోలేమని తెలిపింది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధ్యక్ష కార్యాలయంలోకి అడుగుపెట్టిన ఐదు వారాల్లోనే భౌగోళిక రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. రష్యా అధినేత పుతిన్‌తో ఫిబ్రవరి 12న ఫోన్ కాల్లో మాట్లాడారు. ఆ తర్వాత 18వ తేదీన సౌదీ అరేబియాలో అత్యున్నత స్థాయి దౌత్యవేత్తలు, మంత్రులు భేటీ అయ్యారు. సంబంధాలను మెరుగుపర్చుకొనేందుకు రెండు దేశాలు ముందుకు అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలో సౌదీ తర్వాత తుర్కియేలోని అమెరికా రాయబార కార్యాలయం అందుకు వేదికయింది. వాషింగ్టన్, మాస్కోలోని దౌత్య కార్యాలయాల్లో ఉన్న వివాదాలను ఈ సందర్భంగా చర్చించుకొన్నారు.

మూడేళ్ల క్రితం ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటినుంచి ఆంక్షలతో రెండు దేశాల మధ్య నిలిచిపోయిన విమాన సర్వీసులను పునరుద్ధరించాలని రష్యా ప్రతిపాదించింది. మునుపటి అమెరికా పాలకుల మూసశైలితో పోలిస్తే ట్రంప్ ఆయా అంశాలపై చూపిస్తున్న వాస్తవిక ధోరణి బాగుందని పుతిన్ ఈ సందర్భంగా కొనియాడారు. కొత్త యంత్రాంగంతో చర్చలు సరికొత్త ఆశల్ని రేకెత్తిస్తున్నాయన్నారు. సంబంధాలు పునరుద్ధరించుకొని, క్రమక్రమంగా సమస్యల్ని పరిష్కరించుకుంటామని ఆశాభావం వ్యక్తంచేశారు.

# అరబ్‌లో భారతీయ మహిళకు ఉరిశిక్ష



- చివరి కోరికగా బంధువులతో మాట్లాడి...
- తాను నిర్దోషినని రోదిస్తూ మృత్యుపరిష్వంగంలోకి

యూఏఈలో భారత మహిళ షెహజాద్ ఖాన్‌కు మరణశిక్ష అమలైంది. తన సంరక్షణలో ఉన్న చిన్నారి మృతి కేసులో హత్య అభియోగాలు నమోదుకావడంతో ఉత్తరప్రదేశ్‌లోని బాందా జిల్లాకు చెందిన ఆమెకు యూఏఈ ప్రభుత్వం మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. తమ కుమార్తెను రక్షించాలంటూ కుటుంబం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో చివరకు ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఫిబ్రవరి 15నే ఈ శిక్ష అమలైంది. ఈ విషయాన్ని ఢిల్లీ హైకోర్టుకు విదేశాంగ శాఖ తెలియజేసింది.

యూపీలోని బాందా జిల్లా గోయా ముగ్లి గ్రామానికి చెందిన షెహజాది 2020లో కిచెన్లో పనిచేస్తుండగా అగ్నిప్రమాదానికి గురయింది. అనంతరం ఆసుపత్రిలో చికిత్సతో కోలుకుంది. 2021లో ఉజైర్ అనే వ్యక్తి ఆమెను యూఏఈలోని అబుదాబీకి తీసుకెళతానని, అక్కడ జీవితం బాగుంటుందని ఆశపెట్టాడు. ఆ మాటలు నమ్మి అతడితో వెళ్లింది. ఉజైర్ ఆమెను ఆగ్రాలోని తమ బంధువులైన ఫైజ్, నాడియా దంపతులకు విక్రయించాడు. వారు అమెను అబుదాబీకి తీసుకెళ్లారు. చివరికి ఈ వ్యవహారం కోర్టుకు చేరడంతో.. న్యాయస్థానం ఆదేశాలతో ఫైజ్-నాడియా దంపతులపై మానవ అక్రమ రవాణా కేసు నమోదు చేశారు. మరోవైపు అదే సమయంలో ఫైజ్-నాడియా దంపతుల బిడ్డ బాగోగులు షెహజాదినే చూస్తోంది. అనుకోకుండా ఆ బిడ్డ చనిపోవడంతో ఆ దంపతులు ఆమెపై హత్య ఆరోపణలు మోపారు. అక్కడి దర్యాప్తు బృందాలు ఆమెను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చాయి. షెహజాది మాత్రం ఔషధాల విషయంలో ఆ దంపతులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే చిన్నారి ప్రాణాలు పోయినట్లు చెబుతోంది. కానీ, న్యాయస్థానం మాత్రం ఆమెకు మరణశిక్షను విధించింది. ఇక యూపీలోని ఆమె తండ్రి షబ్బీర్ ఖాన్ తన కుమార్తెను కాపాడాలని ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశాడు. తాజాగా ఫిబ్రవరి 16వ తేదీన అక్కడి జైలు అధికారులు షెహజాది చివరి కోరిక ఏమిటని అడగ్గా కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మాట్లాడతానని అభ్యర్థించింది. దీంతో యూపీలోని ఆమె కుటుంబ సభ్యులతో వారు మాట్లాడించారు. ఈ సందర్భంగా తాను నిర్దోషినని ఆమె కుటుంబం వద్ద కన్నీటి పర్యంతమైంది. తాజాగా ఆమెకు మరణశిక్ష అమలయింది.

# జర్మనీలో కారు బీభత్సం..

## ఒకరు మృతి, పలువురికి గాయాలు

జర్మనీలో వరుస కారు బీభత్స ఘటనలు కలకలం రేపుతున్నాయి. తాజాగా మ్యాన్‌హైమ్ నగరంలో జనంపైకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందారు. అనేక మంది గాయాలపాలయ్యారు. వేగంగా వచ్చిన ఓ ఎసయూవీ పాదచారులపైకి దూసుకెళ్లినట్లు ప్రత్యక్షసాక్షులు వెల్లడించారు. ఓ అనుమానితుడి అరెస్టు చేసిన పోలీసులు.. ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలోని ప్రధాన షాపింగ్ వీధి ప్లాంకెన్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు భారీ సంఖ్యలో సిబ్బందిని మోహరించారు. 3లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాన్ని అలర్ట్ చేసిన అధికారులు.. డౌన్టౌన్ ప్రాంతంవైపు రావద్దని, ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచించారు. తొలుత ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించలేదు. కేవలం 'ప్రాణహాని పరిస్థితి నెలకొందని మాత్రమే పేర్కొంటూ నగరంలో అలర్ట్ జారీ చేశారు.

జర్మనీలో కొంతకాలంగా ఈ తరహా ఘటనలు తరచూ చోటుచేసుకోవడం స్థానికంగా ఆందోళనకు కారణమవుతోంది. గత డిసెంబర్లో మాగ్దేబర్గ్ కారు దూసుకెళ్లిన ఘటనలో ఆరుగురు చనిపోగా సుమారు 200 మంది గాయపడిన విషయం తెలిసిందే. ఇందులో ఏడుగురు భారతీయులు కూడా ఉన్నారు. ఆ కేసులో సౌదీకి చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ ఫిబ్రవరిలోనూ మ్యునిక్ సెంట్రల్ రైల్వే స్టేషన్ సమీపంలో జనంపైకి కారు దూసుకెళ్లిన ఘటనలో దాదాపు 30 మంది గాయపడ్డారు. తాజా ఘటనలోనూ అనేక మంది గాయపడినట్లు సమాచారం.

స్పోర్ట్స్ చైతన్యరథం

# ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అవార్డ్‌కు ఎంపికైన రిషబ్‌పంత్

టీమిండియా స్టార్ వికెట్ కీపర్ కమ్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్‌కు అరుదైన ఘనత దక్కబోయే అవకాశం కనిపిస్తోంది. అతడు తాజాగా ప్రతిష్ఠాత్మక అవార్డుకు నామినేట్ అయ్యాడు. క్రీడా ప్రపంచంలోనే అతిపెద్ద అవార్డు అయిన లారస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డుకు అతడి పేరును పరిశీలిస్తున్నట్లు లారెస్ స్పోర్ట్ తాజాగా వెల్లడించింది. దీంతో 'బెస్ట్ కమ్ బ్యాక్ ఆఫ్ ది ఇయర్' అవార్డు విభాగంలో పంత్ నామినేట్ అయ్యాడు.



ఈ విషయాన్ని తెలియజేస్తూ లారెస్ స్పోర్ట్ తాజాగా సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టింది. అయితే ఇప్పటి వరకు కేవలం 1 క్రికెటర్‌కి మాత్రమే ఈ అవార్డు లభించింది. ఆ ఆటగాడు మరెవరో కాదు సచిన్ టెండూల్కర్. గాడ్ ఆఫ్ క్రికెట్ సచిన్ టెండూల్కర్ తర్వాత ఇప్పుడు రిషబ్ పంత్ లారస్ అవార్డుకు ఎంపికవ్వడం గమనార్హం.

***రిషబ్ పంత్ రియాక్షన్***

దీనిపై రిషబ్ పంత్ తాజాగా స్పందించాడు. లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డుకు తన పేరు నామినేట్ అవడం పట్ల పంత్ ఆనందం వ్యక్తం చేశాడు. ఆ దేవుడు మనకిచ్చిన వాటిపట్ల ఉంతో కృతజ్ఞతతో ఉండాలని తాను విశ్వసిస్తానని అన్నాడు. కారు ప్రమాదంలో చావు అంచుల వరకు వెళ్లిన తాను ఆ దేవుడి దయ వల్లే బయటపడ్డానని గుర్తు చేసుకున్నాడు.

ఇక ఆ తర్వాత నుంచి తనలో చాలా కసి పెరిగిందని అన్నాడు. తనలో మార్పులు వచ్చాయని.. గ్రౌండ్‌లో పరుగులు వరద పారించాలని అనుకున్నానని చెప్పుకొచ్చాడు. అప్పటి నుంచి ఫిట్‌నెస్‌పై ఫోకస్ పెట్టానని.. టీమిండియాకు మళ్లీ ఆడాలనే కలను నెరవేర్చుకున్నానని తెలిపాడు.

ఇదిలా ఉంటే ప్రస్తుతం ఛాంపియన్స్ ట్రోఫీ జరుగుతోంది. ఇందులో టీమిండియా తరపున పంత్ 11వ ప్లేయర్‌గా కూడా ఆడే ఛాన్స్ లేకపోయింది. దీంతో బెంచ్‌పై కూర్చుని కనిపిస్తున్నాడు. పంత్ ఖచ్చితంగా ICC ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమ్ ఇండియాలో భాగమే, అయినా అతనికి ప్లేయింగ్ 11లో ఆడే అవకాశం లేకపోవడంతో ఫ్యాన్స్ నిరాశచెందుతున్నారు. ఇంతలో అతడు ప్రతిష్ఠాత్మక అవార్డుకు నామినేట్ అవడంతో రిషబ్ పంత్‌తో పాటు మొత్తం క్రికెట్ ప్రపంచానికి చాలా శుభవార్త వచ్చింది. ఈ ఘనత సాధించిన రెండో క్రికెటర్‌గా పంత్ నిలిచాడు.

# ఇక్కడ రోహిత్.. అక్కడ సచిన్ రప్పా రప్పా..!



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియా జోరు కొనసాగుతోంది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌లు నెగ్గి గ్రూప్-ఏ టాపర్‌గా సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 44 పరుగుల తేడాతో గెలుపొందింది. పటిష్టమైన న్యూజిలాండ్‌తో పోరు హోరాహోరీగా సాగుతుందని అంతా భావించారు. కానీ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి(5/42) ఐదు వికెట్లతో విజృంభించడంతో ఈ మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది. అంతకుముందు బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లను కూడా రోహిత్ సేన మట్టికరిపించింది.

ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగే సెమీఫైనల్లోనూ ఇదే జోరు కనబర్చి ఫైనల్ చేరాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ తర్వాత భారత్, ఆస్ట్రేలియా ఇప్పటి వరకు ఈ ఫార్మాట్‌లో పోటీ పడలేదు.

ఈ క్రమంలోనే ఆసీస్‌ను ఓడించి ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు సీనియర్ల గైర్హాజరీలో సంచలన ప్రదర్శనతో పాటు వరుణుడి సాయంతో సెమీస్ బెర్త్ దక్కించుకున్న ఆసీస్.. టీమిండియాకు మరోసారి షాకివ్వాలని భావిస్తోంది. టీమిండియా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో పటిష్టంగా ఉండటంతో పాటు సమష్టి ప్రదర్శనలతో విజయం సాధిస్తోంది.

మరోవైపు ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో సచిన్ టెండూల్కర్ సారథ్యంలో ఇండియా మాస్టర్స్ సైతం దుమ్మురేపుతోంది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచింది. సచిన్, యువరాజ్ సింగ్, ఇర్ఫాన్ పఠాన్, అంబటి రాయుడి వంటి దిగ్గజ ఆటగాళ్లు ఆడుతున్న ఈ టోర్నీ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది.



శ్రీలంక మాస్టర్స్, ఇంగ్లండ్ మాస్టర్స్, సౌతాఫ్రికా మాస్టర్స్ జట్లను ఓడించిన ఇండియా మాస్టర్స్.. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఫ్యాన్స్ రోహిత్ శర్మతో పాటు సచిన్‌పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఇక్కడ రోహిత్.. అక్కడ సచిన్ రప్పా రప్పా.. రఫ్ఫాడిస్తున్నారని కామెంట్ చేస్తున్నారు.

# రోహిత్ బాడీ షేమింగ్ కామెంట్స్‌పై బీసీసీఐ ఫైర్!

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ లావుగా ఉన్నాడంటూ కాంగ్రెస్ నేత శమా మహమ్మద్ చేసిన వ్యాఖ్యలపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ఘాటుగా స్పందించింది. పబ్లిసిటీ కోసం ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేయడం సరికాదని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా అన్నారు. ఓ జాతీయ ఛానెల్‌తో మాట్లాడుతూ.. శమా మహమ్మద్ తీరును తప్పుబట్టారు.

'టీమిండియా కీలకమైన ఐసీసీ టోర్నీ మధ్యలో ఉంది. ఆ సమయంలో ఒక బాధ్యతాయుతమైన వ్యక్తి నుంచి ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు రావడం దురదృష్టకరం. అవి ఆటగాడి వ్యక్తిగత విమర్శలు అయినా.. జట్టు ప్రదర్శనపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. పబ్లిసిటీ కోసం దిగజారుడు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి'అని సైకియా ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోహిత్ శర్మ ఫిట్‌గా లేడంటూ శమా మహమ్మద్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'రోహిత్ శర్మ లావుగా ఉన్నాడు. అతను బరువు తగ్గాల్సిన అవసరం ఉంది'అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు నెట్టింట తీవ్ర దుమారం రేపాయి. శమా మహమ్మద్‌పై క్రికెట్ అభిమానులు విరుచుకుపడ్డారు. ఆమెతో పాటు కాంగ్రెస్ పార్టీపై జుగుప్సాకరమైన రీతిలో ట్రోలింగ్‌కు దిగారు. ఇంత జరిగినా.. శమా మహమ్మద్ తన వ్యాఖ్యలను సమర్థించుకోవడం గమనార్హం. ఓ జాతీయ ఛానెల్‌తో మాట్లాడుతూ.. అవి బాడీ షేమింగ్ కామెంట్స్ కావని, క్రీడాకారుడు ఫిట్‌గా ఉండాలనే తన అభిప్రాయాన్ని మాత్రమే వెల్లడించానని సమర్థించుకున్నారు. రోహిత్ శర్మ కొంచెం ఓవర్ వెయిట్ ఉన్నట్లు తనకు అనిపించిందని, ఆ విషయమే ట్వీట్ చేశానని వివరణ ఇచ్చారు. తనపై అకారణంగా విమర్శలు చేస్తున్నారని, తాను ఇతర కెప్టెన్లతో పోల్చుతూ ట్వీట్ చేశానని, ఆ హక్కు తనకు ఉందని, ఇది ప్రజాస్వామ్య దేశమని చెప్పుకొచ్చారు. ఈ పోస్ట్ కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ విమర్శలకు దారి తీసింది. క్రికెట్ ప్రేమికులు కూడా ఆగ్రహానికి గురవ్వడంతో కాంగ్రెస్ పార్టీ ఆ వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఆ పోస్ట్‌ను కూడా తొలగించాలని శమాను ఆదేశించింది.

# కేకేఆర్ కెప్టెన్‌గా రహానే.. వైస్ కెప్టెన్‌గా వెంకటేష్ అయ్యర్!

ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) తమ కెప్టెన్‌గా వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానేను నియమించింది. గత సీజన్‌లో కేకేఆర్‌ను నడిపించిన శ్రేయస్ అయ్యర్.. ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలానికి ముందు జట్టును వీడటంతో కొత్త కెప్టెన్‌ను ప్రకటించాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే సీనియర్ ప్లేయర్ అయిన రహానేకు జట్టు పగ్గాలను అప్పగించిన కేకేఆర్.. వెంకటేశ్ అయ్యర్‌కు వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసింది. ఈ విషయాన్ని కేకేఆర్ సోమవారం తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో వెల్లడించింది.



వెంకటేశ్ అయ్యర్‌ను భవిష్యత్తు సారథిగా నియమించాలనే ఉద్దేశంతోనే వైస్ కెప్టెన్సీ బాధ్యతలు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. కేకేఆర్ కెప్టెన్‌గా రింకూ సింగ్‌ను నియమిస్తారని ప్రచారం జరిగినా.. మేనేజ్‌మెంట్ అనుభవానికే ప్రాధాన్యత ఇచ్చింది. టీమిండియాకు దూరమైనా.. దేశవాళీ క్రికెట్‌లో ముంబై సారథిగా రహానే సత్తా చాటుతున్నాడు. గతేడాది రంజీ ట్రోఫీతో పాటు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలను రహానే సారథ్యంలోనే ముంబై గెలిచింది.

కేకేఆర్ తాజా ప్రకటనతో ఢిల్లీ క్యాపిటల్స్ మినహా అన్ని జట్ల సారథులు ఎవరో తేలిపోయింది. ఢిల్లీ క్యాపిటల్స్ కేఎల్ రాహుల్ లేదా అక్షర్ పటేల్‌లో ఒకరిని కెప్టెన్‌గా నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో బరిలోకి దిగే కొత్త జెర్సీని కూడా కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆవిష్కరించింది. మూడు టైటిళ్లు గెలిచామనే విషయం తెలియజేసేలా జెర్సీపై మూడు స్టార్లకు చోటు కల్పించింది. జెర్సీ ఆవిష్కరణకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదికగా పంచుకుంది.

'కేకేఆర్ మూడు టైటిళ్లు గెలిచిందనే విషయాన్ని తెలియజేసేలా జెర్సీపై మూడు స్టార్లు కేటాయించాం. మే 27, 2012, జూన్ 1, 2014, మే 26, 2024న మేం టైటిళ్లు సాధించాం. మిథున రాశి రోజునే ఈ ఫలితాలు వచ్చాయి. గతేడాది గెలిచిన టైటిల్ మమ్మల్ని మళ్లీ అగ్రస్థానానికి చేర్చింది. ఈసారి కూడా అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తాం. మూడు టైటిళ్లకు కర్మో, లోర్పో, జీతో అని పేరు పెట్టాం. బెంగాలీ పదాలైన వీటికి ప్రదర్శన, పోరాటం, విజయం అని అర్థం. ఛాంపియన్ వారసత్వాన్ని కొనసాగించేందుకు స్ఫూర్తిగా ఈ పదాలు నిలుస్తాయి.'అని కేకేఆర్ అధికారి బిందా దే తెలిపారు.



# సినిమాలు తీయాలనుకొని క్రికెటర్ అయ్యాను

***- స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి***

టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి జీవిత ప్రయాణం విభిన్నంగా సాగిందని అన్నాడు. తాను ఒకటి తలిస్తే దైవం ఒకటి తలచినట్లు.. ఆర్కిటెక్ట్ అయ్యి సినిమాలు తీయాలని కలలు కన్న తాను చివరకు క్రికెటర్‌ను అయ్యానని తెలిపాడు. 26 ఏళ్ల లేటు వయసులో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్నానని చెప్పాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి(5/42) ఐదు వికెట్లతో సత్తా చాటాడు. కెరీర్‌లో ఆడిన రెండో వన్డేలోనే ఐదు వికెట్ల ఫీట్ సాధించిన తొలి భారత బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి చరిత్ర సృష్టించాడు. అతని అసాధారణ ప్రదర్శనతో టీమిండియా 44 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది.

దుబాయ్ వేదికగానే జరిగిన టీ20 ప్రపంచకప్ 2021లో దారుణంగా విఫలమైన వరుణ్ చక్రవర్తి.. మూడేళ్ల తర్వాత టీమిండియాలోకి రీఎంట్రీ ఇచ్చి సంచలన ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో కేకేఆర్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన వరుణ్ చక్రవర్తికి.. టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టడం కలిసొచ్చింది. ముందుగా టీ20ల్లో అవకాశం కల్పించిన గంభీర్.. ఆ తర్వాత వన్డేల్లో చోటిచ్చాడు. అనేక విమర్శల మధ్య ఓ బ్యాటర్‌ను జట్టు నుంచి తప్పించి మరి వరుణ్ చక్రవర్తిని ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ఎంపిక చేశాడు. కీలక మ్యాచ్‌లో అవకాశం ఇచ్చి తన నిర్ణయం సరైనదేనని చాటి చెప్పాడు.

ఈ సంచలన ప్రదర్శన అనంతరం మీడియాతో మాట్లాడిన వరుణ్ చక్రవర్తి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'నేను చాలా ఆలస్యంగా క్రికెట్‌ను మొదలుపెట్టాను. నా 26 ఏళ్ల వయసులో క్రికెట్ ఆడటం ప్రారంభించాను. అంతకుముందు వరకు ఆర్కిటెక్ట్ అయ్యి సినిమాలు తీయాలని కలలు కన్నాను. అందుకే నాకు భిన్నమైన కెరీర్‌లు ఉన్నాయి. ఇది చాలా విచిత్రంగా ఉంటుంది. 26 ఏళ్ల తర్వాత క్రికెట్ గురించి కలలు కనడం మొదలుపెట్టాను. అవన్నీ నిజమవుతున్నాయి కాబట్టే ప్రస్తుతం సంతోషంగా ఉన్నాను.

నేను దేవుడిపై భారం వేసి నా ప్రాసెస్‌ను మాత్రమే కొనసాగించాను. ఫలితాలు అవే వచ్చాయి. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో నేను నేర్చుకున్న విషయం ఏంటంటే.. మ్యాచ్ ఆరంభం నుంచే ఆత్మవిశ్వాసం కలిగి ఉండటం. ఛాంపియన్స్ అంతా ఇలానే చేస్తారు. విరాట్ కోహ్లీ, రోహిత్, హార్దిక్‌లను చూసి ఈ విషయాన్ని నేర్చుకున్నాను. అయితే న్యూజిలాండ్‌తో మ్యాచ్ ఆరంభంలో చాలా భయపడ్డాను. వన్డే క్రికెట్ ఆడిన అనుభవం ఎక్కువగా లేకపోవడంతో ఆందోళనకు గురయ్యాను. కానీ మ్యాచ్ సాగుతున్నా కొద్దీ నాపై నాకు నమ్మకం ఏర్పడింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, శ్రేయస్ అయ్యర్‌లు తరుచూ మాట్లాడి నాకు అండగా నిలిచారు.' అని వరుణ్ చక్రవర్తి చెప్పుకొచ్చాడు.

చైతన్య రథం
సినిమా
మంగళవారం 4 మార్చి 2025




# 'రాబిన్‌హుడ్'తో డేవిడ్ వార్నర్ ఎంట్రీ..!

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న 'రాబిన్‌హుడ్' మూవీపై ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ బజ్ క్రియేట్ అయ్యింది. ఈ సినిమాలో హీరో నితిన్ స్టైలిష్ లుక్‌తో నటిస్తుండగా వెంకీ కుడుముల ఈ మూవీని డైరెక్ట్ చేస్తున్నారు. ఇక ఈ కాంబోలో మూవీ వస్తుండటంతో ప్రేక్షకుల్లో ఈ చిత్రంపై పాజిటివ్ వైబ్స్ క్రియేట్ అయ్యాయి. దీనికి తోడు ఈ మూవీ నుంచి ఇప్పటికే రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ కూడా ఆకట్టుకున్నాయి.

ఇక ఈ సినిమాలో ఓ స్పెషల్ కేమియోపై నిర్మాత రవి శంకర్ తాజాగా ఓ ప్రకటన చేశారు. 'రాబిన్‌హుడ్' సినిమాలో ప్రముఖ ఆస్ట్రేలియన్ మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఓ కేమియో పాత్రలో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సినిమాతో ఆయన ఇండియన్ సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నాడని రవిశంకర్ తెలిపారు. ఈ సినిమాలోని ఆయన పాత్ర ప్రేక్షకులను ఖచ్చితంగా ఆకట్టుకుంటుందని ఆయన తెలిపారు.

ఈ అనౌన్స్‌మెంట్‌తో ప్రేక్షకుల్లో, డేవిడ్ వార్నర్ అభిమానుల్లో ఈ సినిమాపై క్రేజ్ మరింత బలపడింది. ఇక ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.

## బ్లో అప్

మీనాక్షిచౌదరి



# ఆకట్టుకుంటున్న 'ది ప్యారడైజ్' గ్లింప్స్ !



న్యాచురల్ స్టార్ నాని కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన 'దసరా' చిత్రాన్ని శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించారు. ఈ సినిమాతో శ్రీకాంత్ ఓదెల ఓవర్‌నైట్‌లో మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్‌గా మారిపోయాడు. ఇక తన నెక్స్ట్ చిత్రాన్ని కూడా నానితో స్టార్ట్ చేశాడు ఈ యంగ్ డైరెక్టర్. 'ది ప్యారడైజ్' అనే టైటిల్‌తో ఈ మూవీని తెరకెక్కిస్తున్నాడు. అయితే, 'ది పారడైజ్' నుంచి గ్లింప్స్ వీడియోను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇందులో నాని మాస్ లుక్‌లో డిఫరెంట్ క్యారెక్టర్‌లో కనిపిస్తున్నారు. మొత్తానికి ఈ గ్లింప్స్ అదిరిపోయింది. సినిమా పై ఆసక్తిని పెంచింది.

పక్కా యాక్షన్ ఎలిమెంట్స్ తో రాబోతున్న ఈ సినిమాలో మాస్ కి ఫుల్ మీల్స్ లా ఉంటుందట సినిమా. అన్నట్టు ప్రముఖ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రత్యంగిర సినిమాస్ 'ది ప్యారడైజ్' చిత్ర ఓవర్సీస్ రైట్స్‌ను భారీ డీల్‌కు దక్కించుకున్నట్లు వార్తలు వచ్చాయి. పైగా నాని కెరీర్‌లో ఇది హయ్యెస్ట్ ఓవర్సీస్ డీల్ అని టాక్. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో నటించే కథానాయికను ఇంకా ప్రకటించలేదు. కాగా ఈ చిత్రానికి అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్నారు.

# సోనుది ఫిల్మ్ ఫ్యాక్టరీ ప్రొడక్షన్ No1 ప్రారంభం



స్వయంభు లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో వైభవంగా ప్రారంభమైన సోనుది ఫిల్మ్ ఫ్యాక్టరీ ప్రొడక్షన్ No1 మూవీ ప్రారంభమైనది. సోనుది ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్ జంటగా నటిస్తున్న చిత్రం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్ పి పట్నాయక్ క్లాప్ కొట్టగా తొలి షాట్ ను దేవుని పటాలపై చిత్రీకరణ జరిగింది. దర్శకులు వీరశంకర్, నవీన్ ఎర్నేని, తనికెళ్ల భరణి చిత్ర దర్శక ద్వయం కిట్టి కిరణ్, లక్ష్మీ చైతన్య లకు స్క్రిప్ట్ ను అందించారు. ప్రొడ్యూసర్ ప్రసన్న కుమార్ టి, వంశీ కెమెరా స్విచ్చాన్ చేశారు. సినిమా ఓపెనింగ్ తర్వాత విలేకరుల సమావేశంలో నిర్మాత ఆర్ యు రెడ్డి మాట్లాడుతూ– మా బ్యానర్ నుండి వస్తున్న ఈ చిత్రాన్ని నూతన దర్శకులతో మంచి కథతో సినిమా షూటింగ్ ను మార్చి 6 నుండి తొలి షెడ్యూల్‌ను ఊటి లో ప్రారంభిస్తున్నాం. తొలి షెడ్యూల్ తర్వాత రెండో షెడ్యూల్‌ను హైదరాబాద్ లో ప్లాన్ చేశాం. మా సోనుధి నుండి ఏడాదికి కొన్ని సినిమాలు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. సమాజం మాకు అండగా ఉండి ఎంతో ఇచ్చింది. మా వంతుగా మేము కూడా సమాజానికి మేలు చేసే మంచి సినిమాలు చేయాలని నిర్ణయించుకున్నాం. మా నటీనటులు, టెక్నీషియన్స్ కి అభినందనలు అన్నారు. హీరోయిన్ మానస మాట్లాడుతూ ఈ సినిమా నాకు ఎంతో స్పెషల్. డైరెక్టర్స్ చాలా టాలెంట్ ఉన్నవారు అన్నారు. దర్శకులు కిట్టి కిరణ్, లక్ష్మీ చైతన్యలు మాట్లాడుతూ– మా టాలెంట్‌ను నిరూపించుకునే అవకాశం కల్పించిన నిర్మాత ఆర్ యు రెడ్డికి కృతజ్ఞతలు. సినిమాను గొప్పగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో బిగ్ బాస్ ఫేమ్ శుభశ్రీ, సంధ్య జానక్, కెమెరా మెన్ జోషి తదితరులు పాల్గొన్నారు.

# 6న 'దిల్ రూబా' టీజర్!




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మూవీ 'దిల్ రూబా' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమా నుంచి ఇప్పుడు మరో ట్రీట్‌ను రెడీ చేశారు మేకర్స్.

'దిల్ రూబా' మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ తాజాగా వెల్లడించింది. ఈ మూవీ ట్రైలర్‌ను ఈ నెల 6న రిలీజ్ చేస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ చిత్ర ట్రైలర్ అన్ని వర్గాల ఆడియన్స్‌ను ఇంప్రెస్ చేసే విధంగా ఉంటుందని చిత్ర యూనిట్ కాన్ఫిడెంట్ వ్యక్తం చేస్తుంది. ఈ సినిమాలో కిరణ్ అబ్బవరం పర్ఫార్మెన్స్ అందరినీ ఆకట్టుకుంటుందని వారు చెబుతున్నారు.

ఇక ఈ సినిమాలో రుక్సర్ ధిల్లోన్ హీరోయిన్‌గా నటిస్తుంది. విశ్వ కరుణ్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాకు సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని 14న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

# ఐకానిక్ లొకేషన్స్‌లో ఆర్‌సీ16 షూటింగ్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం తన కెరీర్‌లోని 16వ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నాడు. ఈ సినిమాను దర్శకుడు బుచ్చిబాబు సానా డైరెక్ట్ చేస్తుండగా.. పూర్తి స్పోర్ట్స్ నేపథ్యంలో ఈ సినిమా కథ తెరకెక్కనుంది. ఇక ఈ సినిమాలో రామ్ చరణ్ సరికొత్త మేకోవర్‌తో కనిపించనున్నాడు. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే మొదలైంది. ఇక నెక్స్ట్ షెడ్యూల్ కోసం ఈ చిత్ర యూనిట్ ఢిల్లీకి పయనం కానుంది.

ఇప్పటికే ఈ చిత్ర నెక్స్ట్ షెడ్యూల్ ఢిల్లీలో జరగనుందనే విషయం తెలిసిందే. అయితే, ఢిల్లీలోని ఐకానిక్ లొకేషన్స్‌లో ఈ షెడ్యూల్ షూట్ చేయనున్నారు. పార్లమెంట్, జామా మస్జిద్ వంటి ఐకానిక్ ప్రదేశాల్లో ఈ షూట్ జరిపేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారట. ఇప్పటికే దీని కోసం కావాల్సిన పర్మిషన్ కూడా లభించిందట. ఇక ఈ ఐకానిక్ ప్లేసెస్‌లో రామ్ చరణ్, జాన్వీ కపూర్‌లపై కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారు.

ఈ సినిమాలో రామ్ చరణ్ పాత్ర అల్టిమేట్‌గా ఉండబోతుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి.